సూర్య
www.suryaa.com
ఆదివారం
14.7.2024









# రాజసానికి... రక్షణకు చిహ్నం తలపాగా

## చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు హాట్ హాట్‌గా మారుతున్నాయి. ఎన్నికలకు ముందే కాదు ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ఎమ్మెల్యేలు గోడలు దూకుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరుతున్న నాయకుల సంఖ్య ఇప్పట్లో తగ్గేలా కనిపించడంలేదు. బీఆర్ఎస్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 7 మంది వరకు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఇలా హస్తం పార్టీ కి జై కొడుతున్న వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మీరేమంటారు..**

**– లోలుగు రామకృష్ణ ప్రసాద్, హైదరాబాద్**

అవును మీరంటున్నది నిజమే ప్రసాద్ గారూ...రోజు రోజుకు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరే వారి సంఖ్య పెరుగుతున్న తరుణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఇక ఎంత మంది కారు దిగతారు? కేసీఆర్‌కి హ్యాండ్ ఇచ్చే జాబితాలో ఎవరెవరు ఉన్నారు..? వలసలకు ఇకనైనా బ్రేక్ పడుతుందా..? అనేది తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఇంకెంత మంది పార్టీ మారతారు అనేది బీఆర్ఎస్ పార్టీనీ కలవరపెడుతుంది. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ కావడం సంచలనంగా మారింది.

అకస్మాత్తుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం వెనుక అంతర్మథనం ఏమిటి అనేదానిపై పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతుంది. ఇకపోతే శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సమావేశానికి ఏడుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ఆ సమావేశానికి హజరుకాని ఎమ్మెల్యేలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జాబితాలో ఉండటం కొత్త చర్చకు దారి తీస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశానికి డుమ్మా కొట్టి మరీ మంత్రి శ్రీధర్ బాబును కలవడంతో వీరంతా కూడా పార్టీ మారతారా? అనే చర్చ జరుగతుంది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరిన సంగతి తెలిసిందే. శనివారం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ సైతం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుని కలవడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఎమ్మెల్యేలు అంతా తమ నియోజకవర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరేందుకే కలిసినట్లు ప్రచారం జరుగుతుంది. అంతేకాదు తమ జిల్లా ఇంచార్జ్ మంత్రి కావడంతో నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యేలు సైతం స్పష్టం చేస్తున్నారు.

**దివంగత సీఎం వైఎస్ఆర్ వారసత్వం విషయంలో తానే వారసురాలిని అని ప్రకటించుకునేందుకు షర్మిల ఎత్తుగడ వేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. గత ఎన్నికల నాటి నుంచి వైఎస్ఆర్ వారసత్వంపై హాట్ డిస్కర్షన్ జరిగింది. వైఎస్ జగన్ తానే వైఎస్ఆర్ వారసుడిని అని ప్రకటించుకున్నారు. తాను అసలైవ వైఎస్ఆర్ వారసురాలినని షర్మిల సైతం ప్రకటించుకున్నారు. ఇలా వైఎస్ఆర్ వారసత్వంపై ఇరువురు మధ్య పొలిటికల్ పంచాయతీ జరిగిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో వైఎస్ జగన్‌ను వైఎస్ షర్మిల కడిగిపారేశారు. మరోమారు ఇది చిలికి చిలికి గాలివానగా మారుతోందనిపిస్తోంది. మీరేమంటారు సార్**

**–పాతుకూరి విజయలక్ష్మి, విజయవాడ**

అవును నాకూ అలానే అనిపించింది విజయగారు.. ఆ మధ్య వైఎస్ షర్మిల దేసాన ప్రశ్నలకు వైఎస్ జగన్ ఏమాత్రం సమాధానం ఇవ్వకపోగా వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. చివరకు వైఎస్ షర్మిల ధరించిన చీర రంగును సైతం ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. వైఎస్ షర్మిల చంద్రబాబు నాయుడుతో కుమ్మక్కు అయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. అయినప్పటికీ వైఎస్ షర్మిల ఏమాత్రం ఆగిపోలేదు. వైఎస్ఆర్ వారసత్వంపై బలంగానే పోరాటం చేశారు. ఇప్పుడు అదే మరోసారి రుజువు చేయబోతున్నట్లు తెలుస్తోంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలోని పలు ప్రాంతాల్లో వైఎస్ఆర్ విగ్రహాలు కూలిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై వైఎస్ జగన్ ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వాన్ని నిలదీయలేదు. కానీ వైఎస్ షర్మిల మాత్రం నిలదీశారు. ఏపీ వ్యాప్తంగా వైఎస్ఆర్ విగ్రహాలను కూలదోస్తున్నారని.. ఇది అప్రజాస్వామికమని షర్మిల కూతురుగా, కాంగ్రెస్ నేతగా వైఎస్ షర్మిల గళం వినిపించారు. ఈ విషయంలో జగన్ మాత్రం గవర్నర్‌కు ఓ లేఖ రాసి మమ అనిపించేశారు. ఈ రెండూ ఒక ఎత్తు అయితే జూలై 8న వైఎస్ఆర్ 75వ పుట్టిన రోజు సందర్భంగా వైఎస్ షర్మిల దూకుడుగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. విజయవాడలో నిర్వహించ నున్న భారీ కార్యక్రమంలో పాల్గొనాలంటూ ఇప్పటికే షర్మిల జాతీయస్థాయి నాయకులను ఆహ్వానిస్తున్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం తండ్రి వైఎస్ జయంతిని నిర్వహించే అంశంపై ఇప్పటికీ నోరు విప్పకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనప్పటికీ వైఎస్ షర్మిల తన తండ్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలలో సోదరుడు వైఎస్ జగన్‌ను మించిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# నవరస నటనా నాయకుడు కోట

## లెజెండ్



ప్రతిఘటన సినిమాలో ఆయన చూపిన విలనిజం నభూతో నభవిష్యత్ అని చెప్పవచ్చు. ఇక అహ నా పెళ్ళంటా సినిమాలో కోట వేసిన పిసినారి పాత్రలో అయన చూపిన మ్యానరిజం, హాస్యంతో కూడిన హావభావాలు తెలుగు సినిమా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది అనే మాట సత్య దూరం కాదు. ఒక విధంగా చెప్పాలంటే విలన్ అంటే ఇంత క్రూరంగా, కర్కషంగా, కిరాతకుడిగా వుంటాడా అని అశేష తెలుగు సినిమా ప్రేక్షకులు భావించేలా అయన పలు సినిమాలలో చూపిన సహజ నటన ను ఎప్పటికి మరచిపోలేం.ఓక విధంగా చెప్పాలంటే ఒకానొక టైం లో అంటే అయన స్టార్ డమ్ నడుస్తున్న రోజుల్లో అయన కోసమే ప్రత్యేకంగా పాత్రలను డైరెక్టర్లు సృష్టించేవారు అంటే కోట శ్రీనివాసరావు ఎంతగా తన ప్రభావాన్ని తెలుగు సినిమా పరిశ్రమపై చూపించాడో ఇట్టే ఊహించవచ్చు. అన్నింటికీ మించి తెలుగు సినిమా పరిశ్రమ చరిత్రలోనే విలన్ పాత్రలకు కొత్త భాష్యం చెప్పిన నటులలో కోట శ్రీనివాసరావును కూడా మనం ఓ ప్రముఖుడిగా నిస్సందేహంగా చెప్పుకోవొచ్చు. ఇంకా చెప్పుకుంటూ పోతే విలన్ పాత్రలలో కోట గారు ఇచ్చే పేస్ ఎక్స్ప్రెషన్స్, అయా పాత్రకు అయన పలికించే ఉగ్రరూపం అత్యంత సహజంగా ఉండటం అయన నటన



యొక్క గొప్పతనం అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. ఏదిఏమైనా నవరసాలు పండించడంలో, తన నటనలో వైవిధ్యాన్ని చూపడంలో తనకు తానే సాటి కోట శ్రీనివాసరావు గారు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏమైనా విలనీజం అనే మాటకు తన సమ్మోహనమైన,అసాధారణ నటన ద్వారా నూటికి నూరు మార్కులు సంపాదించడమే డమే కాదు,తెలుగు సినిమా పరిశ్రమ మరో పది కాలాల పాటు గుర్తుపెట్టుకునే ఎవర్ గ్రీన్ ఉత్తమ,విశిష్టనటుడు కోట శ్రీనివాసరావుకు అశేష తెలుగు సినిమా ప్రేక్షకులం అయిన మనమందరం ఆయనకు ఆత్మీయ, అభిమానపూర్వక జన్మదిన శు భాకాంక్షలు చెప్పే తరుణం, ప్రత్యేక సందర్భం కూడా ఇదే. ఏమైనా తెలుగు సినిమా దర్శకులు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శక్తి మేరకు వారు ఇచ్చిన పాత్రలో లీనమయ్యి ఆ పాత్రకు కొత్త సొగసులు అద్దడంలో అందెవేసిన చెయ్యి మాత్రమే కాదు తాను నటించిన సినిమా బంపర్, సూపర్ హిట్ కావడంలో తన వంతు పాత్రను చాలా అమోఘంగా పోషించే ఈ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు గారు ఆ సర్వేశ్వరుని అనంత కరుణ, కృప, కటాక్షలతో ఇలాంటి జన్మదినాలు మరిన్ని అత్యంత ఘనంగా, గొప్పగా జరుపుకొని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోట్లాది మంది తెలుగు సినిమా ప్రేక్షకులం అయిన మనమందరం మనసా,వాచ, కర్మణ కోరుకుందాం!

**– బుగ్గన మధుసూదనరెడ్డి, 9000369660**

## నవ కవిత్వం

### మార్పు



ప్రభుత్వం మారినప్పుడల్లా
జెండాలు మారుతున్నాయి
గుర్తులు మారుతున్నాయి
ముద్రలు, రంగులు
భవంతులు, విగ్రహాలు
పాటలు, ఆటలు
విధులు, విధానాలు
అన్నీ మారుతున్నాయి

ఏవేవో, ఎన్నెన్నో
ఎందుకో, ఏమో
అవసరం లేకున్నా
మారుతున్నాయంతే
అనుకూలత కోసమో
పగ-ప్రతీకారాల కోసమో
విద్వేషమో, వికృతత్వమో
పిచ్చితనమో, ఇంకేమో
ఆకస్మికంగా
అన్నీ మారుతుంటాయి
అసలు మారాల్సిన ప్రజల జీవితాలు
తప్ప!!

— కార్తీక రాజు
8977336447

## లేఖలు




**ముఖచిత్ర కథనం బాగుంది** కాశ్మీరీ కుంకుమపూవుపై మాకు తెలియని చాలా విషయాలు తెల్పిన రచయితకు, ప్రచురించిన సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురించాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఞతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**
వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**
వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## హద్దులు దాటొద్దు!!




చిరుతో ఎలుగ్గొడ్డో తరచూ
ఊళ్ళపైబడి
మనుషులపై పశువులపై దాడి
చేస్తుంటే
బిక్కుబిక్కుమంటాం!
విషయం అర్థమైతే అవి దాడి
చేయడంలో
వింతేముంది అన్పిస్తుంది?
అడవి గుండెల్లో లే అవుట్లేసి
ఇళ్ళు కట్టుకుని
తిష్టేస్తే అంతే మరి!
ఎంత అడవి తల్లయినా మనం
ఆక్రమిస్తే
నివాసాలు ఏర్పాటు చేసికొంటే..
తనెక్కడుంటుంది పాపం!
తన సంతానం ఏమౌతుంది?
ఊరి మీద పడక ఏంచేస్తాయి!
మరో పక్క..
తన దూకుడెక్కువైందా అని వం-
ఁణుడే
నాలిక్కర్చుకునేలా..
నాలుగు చినుకులకే ఊర్లన్నీ
పడవలేసుకుని హైలెస్సా అంటూ
హైరానా పడుతున్నాయి!
నిజానికి వరుణుడేం తప్పు
చేయలేదు..
ఎండలు మండే కాలంలో
ఎండిపోయి
కనుమరుగయ్యే చెరువుల్ని
అటూ ఇటూ చూసి కన్నుకొట్టి
కబ్జా చేసిన పాపం మళ్ళీ ఊర్లదే!
వానొస్తే చెరువు చెరువవక
మరేమవుతుంది!
ఊరు చెరువులో మునగకేం
చేస్తుంది
లోయలో అరుపులా పర్యావరణం
మనమేమంటే తిరిగి అదే
అంటుంది
ఏంచేస్తే అదే చేస్తుంది..
మంచి చేస్తే మంచి చెడు చేస్తే
చెడు!
దాన్ని చూసయినా మనం
మారాలి..
రేపటికి కాసిని పచ్చనాకులు
స్వచ్ఛమైన నీళ్లు
మిగిల్చాల్సిన బాధ్యత మనదే!
నదుల పరీవాహక ప్రాంతాలు,
చెరువులు
అడవులు.. ఇలా ప్రకృతి శక్తుల్ని
వాటి
మానాన వాటిని విశాలంగా
బ్రతకనిస్తే..
తిరిగి మన మానాన మనని
ప్రశాంతంగా
బ్రతకనిస్తాయి!!

– భీమవరపు పురుషోత్తమ్
9949800253










# సూర్య బుడత



**బాలల కథ**

## అమ్మ కథలు చెబుతుంది



కంటికి మందు తరువాత ఆ ఆరేళ్ళ పాపకు బ్యాండేజ్ కట్టారు "అమ్మా బోర్ కొడుతోంది," అంది ఆ పాప.

" కథ చెప్పా మంటావా "అడిగింది తల్లి

" చెప్పమ్మా "

" నేను చెప్పినట్లే నీవూ చెప్పాలి" అంది. రాజుగారు ఏడుచేపలు కథ చెప్పసాగింది .

"చేపా చేపా ఎందుకు ఎండలేదు "బిగ్గరగా కోపంతో అంటున్నట్లు అంది.

ఆరేళ్ళ పాప అలాగే నటిస్తూ కోపం తో అంటున్నట్లు బిగ్గరగా అంది

" గడ్డిమోపు అడ్డమొచ్చింది" ఏడుపుగొంతుతో మెల్లగా అంది తల్లి. ఆ పాప అలాగే ఏడుపుగొంతుతో నటిస్తూ అంది .

కథ మొత్తం అలాగే బిగ్గరగా ఒక వాక్యం, మరోవాక్యం మృదువుగా జాలిగా అన్నట్లు చెబుతూ చేబుతోంది .

చివరగా "నా బంగారు పుట్టలో వేలుపెడితే కుట్టనా "రాగం తీస్తూ చెప్పింది తల్లి

ఆ పాప అలాగే బుంగమూతి పెడుతూ రాగం తీస్తూ చెప్పింది.

" కథ కంచికి మనం ఇంటికి "అందితల్లి


"అమ్మా కథ బాగుందమ్మా. అయినా ఈ కథ ఇంతవరకు నాకు చెప్పలేదుకదమ్మా . నీకు కథలు చెప్పడం వచ్చా " అడిగింది పాప "చెప్పడం వచ్చు. ఇకమీదట ప్రతిరోజూ కథలు చెబుతాను పాపా "అంది


"మా అమ్మ కథలు చెబుతుంది. మా అమ్మ కథలు చెబుతుంది "అంటూ పాప సంతోషంతో చప్పట్లు కొట్టింది . '


మంచిజీతం కల వుద్యోగం అంటూ నిన్ను విస్మరించాను, నీ చేతికి సెల్ ఫోన్ ఇచ్చి నిన్ను ఎల్లవేళలా సెల్ ఫోన్ గేమ్స్ ఆడుకొనేలా చేసాము. అందువలన నీకు చూపు సమస్య ఏర్పడటం గురించి బడి టీచర్ చెబితే ఆసుపత్రికి తీసుకెళ్ళాము . ఆలశ్యం అయివుంటే చూపే పోయివుంటుందని డాక్టర్ త్రివేణి మందలించింది. ఆ సెల్ ఫోన్ వలన నీ కనులకు చీకటి ఏర్పడ్డాక నా కనులు తెరుచుకొంది. నేనిప్పుడు వుద్యోగం రాజీనామా చేసాను , ఎప్పుడూ నీతోనే వుంటాను ఇంకా బోలెడు కథలు చెబుతాను 'మనసులో అనుకొంటున్నఆ తల్లి కళ్ళలో కన్నీరు ప్రవహించింది . కన్నీరు తుడుచుకొని పాపకు మరొక కథ చెప్పడానికి ప్రారంభించింది ఆ తల్లి.

**(అయిపోయింది)**

**ఓట్ర ప్రకాష్ రావు**
**09787446026**






### మంచి మాటలు

" క్షమించేవాడు మనిషి , క్షమించు అని అడిగేవాడు పెద్దమనిషి "

| | | | |
|---|---|---|---|
| | 3 | 2 | |
| | | | 4 |
| 1 | | | |
| | | 1 | 2 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | | 1 | |
| | 2 | 4 | |
| | | 2 | 1 |

| | | | |
|---|---|---|---|
| 2 | 4 | | 3 |
| | | | |
| | 3 | 4 | |
| | | | 1 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | | 4 | |
| | 1 | 2 | |
| 2 | | | 3 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | | 4 | |
| | 1 | 2 | |
| 2 | | | 3 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | 3 | 4 | |
| | 4 | 3 | |
| | 1 | | 4 |

| | | | |
|---|---|---|---|
| | | 1 | 2 |
| 2 | | | |
| | | | 4 |
| 4 | 3 | | |



## ఈవారం కథ

# వనమాలి



నొప్పి..నొప్పి బాబోయ్ నా చేతులు నొప్పి అని బంటిగాడు కుయ్యో%ౌ %మొర్రో %ౌ%అంటూ ఏడుస్తున్నాడు .చుట్టు ప్రక్కల వాళ్ళంతా పరుగున బంటి గాడి దగ్గరకు చేరుకున్నారు .ఏమైంది అంటూ ఆరా తీయగా భవిష్యత్ లో మీకు రాబోయే అతిపెద్ద ప్రమాదాన్ని తొలగించే ప్రయత్నంలో నా రెండు చేతులు ఇదిగో ఇలా కందిపోయాయి. చూడండీ.. అంటూ రెండు చేతులు చూపించాడు .అవి బాగా ఎర్రగా కందిపోయి బొబ్బలు వచ్చాయి. అందులో ఒక అవ్వ బంటిని దగ్గరకు తీసుకొని ప్రేమగా తల నిమురుతూ ఏంటి బాబు మనకు రాబోయే ఆ ప్రమాదం? అని అడిగింది. దానికి బంటి అవ్వ చెయ్యి పట్టుకొని ఎండిపోయిన చెట్లు ,చెరువులు చూపిస్తూ, చూడు అవ్వా ! వానలు లేక ఆ మొక్కలు,ఈ చెరువులు ఎలా ఎండిపోయాయో .నీళ్ళు లేక ఈ చెరువులు ఎండిపోతే మనకు తాగడానికి నీరు ఎక్కడనుండి వస్తుంది ?మన పరిస్థితి ఏమిటి ?అని అన్నాడు .జవాబు లేని ఆ ప్రశ్నకు ఆ అవ్వ ఏమీ సమాధానం చెప్పలేక మౌనంగా బంటి కళ్ళలోకి చూస్తూ వాడు చెప్పేది వింటూ ఉంది.

నిన్న మా బడిలో పంతులు గారు పర్యావరణ పరిరక్షణ అనే పాఠం చెబుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి,ప్రకృతిని కాపాడే విషయంలో బాధ్యతగా ఉండాలని , చెట్లను విచక్షణా రహితంగా కొట్టి వేస్తే మనుషులే కాక సకల జీవకోటికి నీరు, ఆహారం దొరకదని చెప్పారు. ఇంట్లో తాగడానికి నీరు కొంటున్నాము, భవిష్యత్తులో ఆక్సిజన్ కూడా కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని ,నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదవారు ఆకలితో ఇప్పటికే అల్లాడిపోతున్నారని చెప్పారు . మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు విధిగా చేయాలన్నారు .మొక్కలు నాటడం వలన మానవాళికే కాక పశు,పక్ష్యాదులకు కూడా ఆహారం, నీరు, ఆవాసం దొరుకుతుందన్నారు.మొక్కలలోని ఔషధ గుణాల గురించి చెప్పారు .మొక్కలు నాటడం అంటే ఇతరులకు సహాయ పడటం లాంటిదేనని , దానిలోనే నిజమైన ఆనందం ఉందని చెప్పారు.మొక్కలతో స్నేహం చేయాలన్నారు.ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క నాటుతామని మా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.అందుకే నేను ఇంకా నాస్నేహితులం మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నాము. అందుకే మన పరిసరాలలో నా వంతుగా మొక్కలు నాటుతున్నాను. నేల గట్టిగా ఉండుట వలన మట్టి తవ్వి నా చేతులు నొప్పెడుతున్నాయి అన్నాడు.

అప్పుడు అవ్వ బంటిని గట్టిగా హత్తుకొని, మా రోజులలో ప్రతి ఇంటికి ఒక చెట్టు ఉండేది. సాయంత్రం అయ్యేసరికి అందరం ఆ చెట్టు కింద కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ ఆ చెట్టు నుండి వచ్చే గాలితో హాయిగా సేద తీరి, చాలా ఆరోగ్యంగా ఉండేవాళ్ళం. కానీ మనం ఇప్పుడు ప్రకృతిని వెలివేస్తూ భావితరాల భవిష్యత్తును బలి పెడుతున్నాం .చేజేతులా జీవం పోసే మొక్కలను కొట్టి ఇప్పుడు ఆరోగ్యం కోసం ఆరాట పడుతున్నాం.చిన్నపిల్లలు దేవుడితో సమానం అనే మాట నిజం చేస్తూ నువ్వు చాలా మంచి పని చేస్తున్నావు . నేను కూడా నాకు చేతనైనంత వరకు నువ్వునాటిన చెట్లకు నీళ్ళు పోస్తూ వాటికి రక్షగా ఉంటాను. అక్కడున్నవారితో చిన్నవాడైనా వీడు చాలా గొప్ప పని చేస్తు న్నా డు .మనందరం కూడా బంటి తో కలిసి మొక్కలు నాటుదాం,మన ప్రకృతిని సంరక్షించుకుందాం అని అంది అవ్వ . కలసిమెలసి పనిచేయటంలోని ఆనందాన్ని ఆస్వాదిస్తూ అందరూ ఉత్సాహంగా మొక్కలు నాటారు . చిన్న వయసులోనే ఇంత సామాజిక బాధ్యత ఉన్న బంటీని అందరూ చుట్టూ చేరి అభినందించారు.బంటి చాలా సంతోషంతో తను నాటిన మొక్క దగ్గర కూర్చొని దాని వైపు చూశాడు . అది కృతజ్ఞతాపూర్వకంగా ఆకులు ఊపుతూ బంటి ముఖాన్ని ప్రేమగా తాకింది.



**ధూళిపాళ్ళ మాధవికిషోర్**
**9949735253**

# ఎందరో అమ్మల నిజమైన కథ..!

కొన్ని నెలల క్రితం, కొత్తగా ఒక పనిమనిషి చేరింది, నాకు పనిమనిషి అన్న పదం పలకడం ఇష్టం ఉండదు, మీకందరికి అర్థం కావటానికి ఇలా రాశా, ఇక ఈ వ్యాసంలో ఈ పదాన్ని ఊయోగించను. ఆవిడ పేరు.......

మూడు నాలుగు రోజుల తరువాత అడిగా..

అమ్మా! ఎక్కడ మీ ఇల్లు, ఎంత మంది పిల్లలు అని.

ముగ్గురు అమ్మాయిలు అండి,

పెళ్లిళ్లు అయ్యాయా, లేదండి ఇంకా చదువుకుంటున్నారు.

, ఏం చదువు కుంటున్నారు అని క్యాజువల్ గా అడిగా, పెద్ద అమ్మాయి M.Sc ఆర్గానిక్ కెమిస్ట్రీ చేసి డిగ్రీ కాలేజ్ లో కాంట్రాక్ట్ లెక్చరర్ గా చేస్తోంది,

ఆ అంటూ నోరు తెరిచా,

రెండో అమ్మాయి M.Sc Computers మొదటి సంవత్సరం,

మూడో అమ్మాయి ఎంబీబీస్ రెండో సంవత్సరం.

ఆ అని నోరు వెళ్ల బెట్టా. నర్సింగా అన్నా,

కాదు సార్ ఎంబీబీస్ తెంది.

నాకు అర్థం కావటం లేదు, ఈవిడ ఏమంటోంది,

ఏం మాట్లాడుతోంది. ఈవిడకు ఏం మాట్లాడుతోందో అర్థం అవుతోందా?

మళ్ళీ అడిగా, అవే సమాధానాలు,

ఎంబీబీస్ ౽ ఫ్రీ సీటా అని అడిగా,

అవును సార్, ఫ్రీ సీట్ యే,

అదేదో బిల్డింగ్ ఫీజ్ అంటా, దానికే తంటాలు పడుతున్నా కట్టడానికి.

ఏ స్కూలులో చదువుకున్నారు అమ్మా మీ పిల్లలు అని అడిగా?

ఇక్కడే, మన ఊరి బడి లోనే 10 వ తరగతి వరకు.

లాంగ్ టర్మ్ గట్రా వెళ్లిందా ఎంబీబీస్ అమ్మాయి అని అడిగా, ఏం లేదయ్యా, మన ఊరి కాలేజ్ యే, నాకు ఈ చదువుల గోల ఏం తెలీదయ్యా, ఇప్పుడు ఇప్పుడే కాస్త నోరు తిరుగుతోంది.

ఏం చదువుకున్నావు అమ్మా నువ్వు అని అడిగా,

రెండులో మానేశానయ్యా, నాకు కూడికలు, తీసి వేతలు కూడా రావు.

చాలా కష్టాలు పడ్డాను పిల్లలను ఈ స్థాయికి తీసుకు రావటానికి.

మీ ఆయన ఏం చేస్తాడు అని అడిగా,

ఆయనా అందరి లాగే, ఇంటి విషయాలు ఏం పట్టవు.

ఆయన త్రాగుతాడు,

100 రూపాయలు సంపాదిస్తే 10 రూపాయలు ఇంట్లో ఇవ్వడం కూడా గగనం. ఇప్పుడు ఇప్పుడు కొంచం మారుతున్నడు, పాప డాక్టర్ కోర్స్ లో చేరిన తరువాత.

మా పెద్ద అమ్మాయిని ఏడో తరగతిలో చదువు మానిపించేసా, కానీ వాళ్ల టీచర్ ఇంటికి వచ్చి, నన్ను మందలించి, మంచి తెలివి గల అమ్మాయి, చక్కగా చదువు కొంటోంది అని చెప్పి బడికి తీసుకొని వెళ్ళింది. అప్పటికి అర్థం అయ్యింది నాకు, నా పిల్లలు తెలివి గల వాళ్ళు అని, నా పిల్లల చదువులు ఆగ కూడదు అని ఇంకో రెండు ఇల్లులు ఎక్కువ ఒప్పుకోవటం మొదలు పెట్టా.

ఇంట్లో సరిగ్గా కరెంట్ కూడా ఉండేది కాదు, మూడు మూడు నెలలు బిల్ కట్టలేక పోయే దాన్ని, పిల్లలు ఆలాగే బుడ్డి దీపాల్లో చదువుకున్నారు.

ఇప్పుడు కాస్త పర్వాలేదు, పెద్ద అమ్మాయి కాస్త సంపాదిస్తోంది. ఎలాగో కిందా మీదా పడుతున్నాను అంది.

నాకు నోట మాట రాలేదు. ఒక చదువుకోని మహిళ,

భర్త త్రాగుబోతు, ఇంతగా కష్టపడి పిల్లలను ఇంతగా వృద్ధిలోకి తెచ్చిందా.

లక్షలు, లక్షలు ఫీజులు పోస్తుంటే నాపిల్లలు అస్సలు చదవట్లేదు. నా పిల్లలు వీళ్ళలో సగం చదువుకున్నా చాలు అనుకున్నా.

అంతే, నాకు అర్జంట్ గా వీళ్ళ ముగ్గురు పిల్లలని కలవాలి అనిపించింది.

నేను మీ ముగ్గురు అమ్మాయిలతో మాట్లాడాలి, నాకు పరిచయం చేయ్యాలి అని అడిగా, అలా మా పిల్లలను చూపించినట్లు ఉంటుంది అన్నా.

నేను ఆడిగినట్లే, ముగ్గురిని తీసుకొని సాయంత్రం ఇంటికి వచ్చింది . ముగ్గురు వాళ్ళ అమ్మతో పాటు నేలపై కూర్చున్నారు. నా మనస్సు చివుక్కుమంది. ఎంతగానో బ్రతిమాలితే గాని, కుర్చీలపై కూర్చో లేదు. ఆమె నేల పైనే. నాకు అలవాటే సారూ అంది,

నా పిల్లలు నాలా మిగిలి పోకూడదు అనే ఈ నా శ్రమ అంతా. మీలాంటి గొప్ప వాళ్ళతో పాటు సరి సమానంగా కూర్చున్నారు చూడండి, ఇది చాలు, అంది కళ్ళ నీళ్లతో.....

నేను కాదు, వీళ్ళు కాదు,

నువ్వా ... గొప్ప దానివి అన్నా.

మొదటి పది నిమిషాలు ముగ్గరు ముడుచుకు కూర్చున్నారు, తరువాత కొంచం కొంచం మాట్లాడ్డం మొదలు పెట్టారు.

తాము పడిన కష్టాలు, పడుతున్న కష్టాలు, ఎలా సీట్లు తెచ్చుకొంది, ఎంతో కొంత స్కాలర్షిప్ లు రావటం, అవి సహాయ పడ్డం. నిజంగా ఇలాంటి వారే పథకాలకు అర్హులు.

వీళ్లకు ఏదన్నా సహాయం చేద్దాం అని గట్టిగా మనసులో అనుకున్నా. ఏం కావాలి అని అడిగా,

ఎంత అనుకువగా ఉన్నారో, అంత ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం మెండుగా ఉన్నాయి. ఏమి అడిగినా, ఆహా వద్దు అనే సమాధానం.

నేను, నా అర్ధాంగి అడగంగా, అడగంగా, ఒక Two వీలర్ ఇప్పించండి, ముగ్గరము కలిసి ఊయోగించు కుంటాం, మీకు నెల నెలా ఇస్తాం, మేము లోన్లో తీసుకోలేము, అనవసరమైన వడ్డీ అన్నారు. 2 వీలర్ ఉంటే, కాస్త సౌలభ్యగా ఉంటుంది, సగం డబ్బులు ఆటోలకు అయి పోతున్నాయి, మా ఏరియా దగ్గర షేర్ ఆటోలు దొరకవు, దొరికే స్టాప్ వరకు నడచి అలిసిపోవటం, సమయం కూడా వృర్థం అవుతున్నాయి. 2వీలర్ ఉంటే అలిసిపోము, మిగిలిన సమయాన్ని చదువు కునేందుకు ఉపయోగించు కుంటాము అన్నారు.

2 వీలర్ ఇప్పించా డబ్బులు కట్టి,

ఒక తొమ్మిది నెలల్లో నాకు ఒక పైసా వదలకుండా మొత్తం తీర్చేశారు, ఒక పది వేలు ఉంచుకోండి అని అన్నా వినకుండా.

పెద్ద అమ్మాయి ఇద్దరిని డ్రాప్ చేసిన తరువాత తన కాలేజ్ కు వెళ్లి పోతుంది. మళ్ళీ ఇద్దరని పికప్.

పెద్ద అమ్మాయి J.L పోస్టులకు సన్నద్ధం అవుతోంది. రెండో అమ్మాయి Software ఫీల్డ్ వైపు వెళ్ళాలి అని.

చెప్పటం మరిచా ఇప్పుడు పెద్ద అమ్మాయి మా పిల్లలకు హెూమ్ ట్యూటర్. ప్రతి రోజు రెండు గంటలు.

ఏదో సినిమాలో అమ్మకంటే పెద్ద యోధురాలు ఎవరు ఉండరు అంటాడు హీరో, మనకు తెలియని ఈ తల్లి లాంటి యోధురాళ్లు ఎందరో..

ఒకసారి ఆమె తో అన్నా, ఇంకో రెండు సంవత్సరాలు కష్టం మీకు, తరువాత పిల్లలు చూసుకుంటారు మిమ్మల్ని అని,

ఏం సారూ నన్ను పనిలో నుంచి తీసేయ్యాలి అనుకుంటున్నారా, నా ఒంట్లో శక్తి ఉన్న%శీ%త వరకు నేను నా పని మానను.

ఆమెను అడిగా, మీ ఆయన మీద కోపం లేదా అని,

లేదు అన్నది, పిల్లలకు ఉంది, అయినా వీళ్లు తమ చదువులు అయిపోయి, పెళ్లిళ్లు చేసుకొని వెళ్లి పోతే తను నేనే కదండి, కోపాలు, తాపాలు పెట్టుకుంటే అవుతుందా అని సమాధానం. చిన్న చిన్న వాటికి గొడవలు పడి విడి పోతున్న జంటలకు ఈమె పెద్ద సమాధానం.

ఒక సారి పెద్ద అమ్మాయి అంది, మా నాన్న తన స్నేహితుల ముందర మా గురుంచి గొప్పగా చెబుతుంటాడు, అక్కడే ఆయన మొహం ముందరే వారికి చెబుతాం, ఇదంతా మా అమ్మ కష్టం అని......

ఎందరో అమ్మల నిజమైన కథ..!!!

అమ్మేగా కనగలదు అంత గొప్ప అమ్మని, అమ్మేగా ఆది స్వరం ప్రాణవనే మాటకు .

# పద్యసుధ



.(గతవారం తరువాయి)

**8. ఎప్పుడూ తప్పులే వెదికే యజమాని**

కం.. ఎప్పుడు తప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వఁ గూడ దది యెట్లన్నన్
సర్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు గదరా సుమతీ!

మనిషి అన్నవా డెంత జాగ్రత్తగా పనిచేసేవాడైనా సరే! కొన్ని కొన్ని పొరపాట్లు తప్పవు. ఎదుటివాడు కూడా వీ డెటువంటివాడా? అని ఆలోచించాలి. మంచివాడని తెలిస్తే చూసి చూడనట్లుండాలి. సర్దుకొనిపోవాలి. అంతే కానీ ఐనదానికీ కానిదానికీ వాడిని సాధించటమే ధ్యేయంగా పెట్టుకొని ఉండకూడదు. అదుగో! ఆ సాధించేవాళ్లను గురించే చెప్తున్నాడు కవి.

ఒక అధికారి ఉంటాడు. పరమ దుర్మార్గుడు. ఎప్పుడూ తన క్రింద పనిచేసేవాళ్లు ఏమి తప్పులు చేస్తుంటారా! ఎప్పుడు వాళ్లను శిక్షిద్దామా! అని ఎదురు చూస్తుంటాడు. వాడి కది తప్ప రెండో పని ఉండదు. అటువంటి వాడి దగ్గర ఉద్యోగం చేయటం సులభం కాదు. సుఖమూ కాదు. ఎట్లాగంటే- ఎండ వేళ ఒక పెద్ద పాము పడగ క్రింద ఒక కప్ప ఉన్నది. వెడల్పైన పడగ నీడలో ఉండటం వలన ఎండ తగలకుండా హాయిగానే ఉన్నది కప్పకు. కానీ ఆ హాయి ఎంత సేపు? ఆ పాము దృష్టి ఈ కప్ప మీద పడకుండా ఉన్నంత సేపే! పడ్డదా... ఆ కప్ప పని 'ఇంతే సంగతులు'. పాము కాహారం కావలసిందే! తప్పదు. అనుక్షణమూ క్రిందివాడి తప్పులను వెదికే పైఉద్యోగి వద్ద పనిచే యటం పాముపడగ నీడలో కప్ప ఉన్నట్లుగా ప్రమాదకరమైన దంటున్న ఈ పద్యం బద్దెన (క్రీ.శ.13శ.) రచించిన 'సుమతీశతకం' లోనిది (19).

**9. బంతి-మట్టిముద్ద**

కం.. కందుకము వోలె సుజనుడు
గ్రిందం బడి మగుడ మీదికి న్నెగయుఁ జుమీ!
మందుఁడు మృత్పిండము వలెఁ
గ్రిందం బడి యడఁగియుండుఁ గృపణత్వమునన్.

జీవితంలో మన కెప్పుడూ విజయమే సిద్ధిస్తుంటుందని మన మనుకోగూడదు. ఓటమిని కూడా చవి చూడవలసి వస్తుంది. ఆ ఓటమే ఎదురైనప్పుడు మన మేమి చేయాలి? అదే చెప్తున్నాడు కవి.

ఒక బంతి క్రింద పడ్డది. పడినంత వేగంతోనే పై కెగిరింది. అది దాని లక్షణం. ఒక మట్టి ముద్ద క్రింద పడ్డది. పడిన చోటనే చప్పగా చతికిలబడ్డది. అది దాని లక్షణం. తెలివిగలవాడు బంతిలాంటివాడు. వా డొక విషయంలో దెబ్బతిన్నప్పటికీ నిరాశ చెందడు. మరొక ప్రయత్నం చేస్తాడు. విజయాన్ని సాధిస్తాడు. తెలివితక్కువవాడు మట్టి ముద్ద లాంటివాడు. ఒక నష్ట మెదురైతే చాలు! ఖంగుతింటాడు. బెదిరిపోతాడు. తిరిగి ఆ ప్రయత్నమూ చేయడు. మరొక ప్రయత్నమూ చేయడు. అటువంటివాడి కభివృద్ధి ఉండదు.

చురుకైనవాడిని బంతితోనూ మందకొడిగా ఉండేవాడిని మట్టి ముద్ద తోనూ పోలుస్తూ 'పరాజయానికి భయపడకండి! ధైర్యంతో ముందుకు సాగండి! విజయం తప్పకుండా మీ సొంత మవుతుంది' అని ప్రబోధిస్తున్నది ఈ పద్యం. యోగిజనసార్వభౌముడైన భర్తృహరి రచించిన 'యథా కందుక పాతేన...' అనే శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి (క్రీ.శ.18శ.) చేసిన అనువాద మిది (నీతిశతకం, దైవపద్ధతి, 83).

**10. వెనుకటి దుర్గుణం**

కం. కనకపు సింహాసనమున
శునకముఁ గూర్చుండఁబెట్టి శుభలగ్నమునం
దొనరఁగఁ బట్టము గట్టిన
వెనుకటి గుణ మేల మాను? వినురా సుమతీ!

ఏ సమయంలోనైనా ఏ విషయంలోనైనా ఎవరికి ఏ స్థాన మివ్వాలో వారికి ఆ స్థానాన్ని ఇవ్వాలి. ఎవరి నే విధంగా గౌరవించాలో వారి నా విధంగా గౌరవించాలి. అప్పు డతడూ సంతోషిస్తాడు. ఆ స్థానానికి తగినట్లుగా ఆనందంతో పని చేస్తాడు. ఆ వ్యవస్థ కూడా బాగుపడుతుంది. దానికి వ్యతిరేకంగా జరిగితే- అయోగ్యుడి కున్నతమైన పదవి నిస్తే ఏమవు తుంది?

బంగారపు సింహాసనం చాల విలువైనది. ఆ స్థానం చాల ఉన్నత మైనది. దాని మీద ఒక సమ్రాట్టు కూర్చుంటే దానికీ విలువ. అతడికీ విలువ. అట్లా కాకుండా ఒక ఊరకుక్కను తీసుకొని వచ్చాం. ముహూర్తమూ మంచిదిగానే చూశాం. ఆ కుక్కను ఆ సువర్ణసింహాసనం మీద కూర్చోబెట్టి పట్టాభిషేకం జరిపాం. కుక్క గుణ మేమన్నా మారుతుందా? మారదు కాక మారదు. ఫలిత మేమవుతుంది? ఆ కుక్క ఆ సింహాసనాన్ని కరాబు చేస్తుంది. సింహాసనం విలువ దాని కేమి తెలుసును?

కనుక మంచి ఫలితాన్ని ఆశించినవారు దానికి తగిన వ్యక్తిని తగిన స్థానంలో నియమించాలి. అంతే కాని అల్పుడి నందల మెక్కించగూడదు. వ్యవస్థ పాడైపోతుంది. సమాజం పాడైపోతుం దంటున్న ఈ పద్యం బద్దెన భూపాలుడు (క్రీ.శ.13శ.) రచించిన 'సుమతీశతకం' లోనిది (26).

**11. ముక్కంటి కంటిమంట**

కం. కని కోపించెనొ గానక
మును గోపించెనొ మహోగ్రముగ నుగ్రుడు సూ
చినఁ గాలెనొ చూడక యట
మును గాలెనొ నాఁగ నిమిషమున నతిఁ గాలెన్.

తపస్సు చేసుకొంటున్న పరమేశ్వరుడి దగ్గరకు పార్వతి వచ్చింది. సుమాంజలి సమర్పించింది. అదే అద నసుకొన్నాడు మన్మథుడు. ఇద్దరి మీద కుసుమాస్త్రాలను ప్రయోగించాడు. శివుడి మనస్సు నీళ్ల పద్ద ఇసుక బొమ్మ లాగా జావగారిపోయింది. అంతవరకూ అతని మనస్సుకు పట్టని పార్వతి సౌందర్య మతడి నాకర్షించింది. కానీ అంతలోనే తేరుకొన్నాడు. తన మనస్సు ఈ విధంగా వికలం కావటానికి కారణ మెవరై ఉంటారా? అని చూశాడు. ఎదురుగా మన్మథుడు కనిపించాడు. శివుడు తన మూడవ కన్ను తెరిచాడు. మన్మథుడు భస్మమయ్యాడు. ఆ సందర్భంలోనిది ఈ పద్యం.

శివుడు మన్మథుడిని చూసినాక కోపించాడో, కోపం వచ్చినాక చూశాడో మనకు తెలియదు. శివుడు కోపంగా చూసిన తరువాత అతడు భస్మమయ్యాడో, చూడకముందే భస్మమయ్యాడో మనకు తెలియదన్నట్లుగా క్షణకాలంలోనే జరిగిపోయింది ఈ ఘట్టం. పార్వతి సుమాంజలి, మన్మథుని బాణప్రయోగం, శివుడి కోపం, మన్మథ దహనం- ఇన్ని సందర్భా లొక్క క్షణకాలంలోనే జరిగిపోయిన వైనాన్నీ, అందులోని వేగాన్నీ మనకు తెలియజేస్తున్న ఈ పద్యం కవిరాజ శిఖామ-ణియైన నన్నెచోడుని (క్రీ.శ.12శ.) 'కుమారసంభవం' కావ్యం లోనిది (5- 51).

**12. కమ్మదనం**

ఉ. కమ్మఁదనమ్ము వంశమునఁ గల్గుట కాదు కవిత్వ మందునుం
గమ్మఁదనమ్ము నింపితివి! కాన నవీన కవీన కోటులం
దుమ్మల వంశరత్నమ! యనూన యశంబు గడించినావు! నీ
వెమ్మెయి వ్రాయఁగాఁగ గలిగి తిన్నికృతుల్? కనినావు సత్కృతుల్.

కవిగారూ! మీరు కమ్మకులంలో జన్మించారు కదా! మీ కులం పేరులో కమ్మదన మున్నది. మీ కవిత్వంలోనూ కమ్మదనం- మాధుర్య మున్నది. అందువల్లనే మీరు ఆధునికాంధ్ర కవీశ్వరులలో చాల గొప్పవారనే సత్కీర్తిని పొందారు. మీరు రాశిలోనూ వాసిలోనూ గొప్పవైన ఇన్ని సత్కృతులను- సత్కావ్యాల నెట్లా వ్రాయగలిగారండీ? వ్రాయగలిగారు కనుకనే మీ కనేక సత్కృతులు- సన్మానాలు లభించినై. అదీ మీ అదృష్ట విశేషం. ఆ కారణంగానే మిమ్మల్ని మేము తుమ్మల వంశపు రత్నంగా సంభావిస్తున్నాం!

ఈ పద్యంలోని కమ్మదనమ్ము, కృతుల్ అనే పదాల మీద చక్కని యమకాలంకార మున్నది. తెలుగుదన ముట్టిపడేట్లుగా సశాస్త్రీయ-మైన భాషలో కవిత్వాన్ని వ్రాసి 'అభినవతిక్కన'గా ప్రఖ్యాతిని పొందిన కవీశ్వరులు శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు (1901-1990). వారు 1969లో మా నరసరావుపేటలోని మా ఎస్.ఎస్.%డ%ఎన్. కళాశాలకు వచ్చినప్పుడు వారికి స్వాగతం చెబుతూ మా మిత్రులు డా౹౹ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిగారు వ్రాసిన పద్య మిది. ఇది రెడ్డిగారి 'ఇంద్రధనుస్సు' కవితాసంపుటిలోని 'తెలుగు లెంక' అనే ఖండిక లోనిది (పుట 28).

**13. లోకరీతి**

తే. కాయ లుడివోయినట్టి వృక్షంబుఁ బాఁడి
యెల్లఁ గడచిన ధేనువు నేఁబు గడపి
నతఁడుఁ గార్యము దీర్చిన యతఁడు నపుడ
గాని యాదరణీయులు కారు పిదప.

ఒక పులి మాంసాన్ని తింటుండగా ఎముక పలుకు ఒకటి దాని పళ్ల మధ్యలో గ్రుచ్చుకొని కురుపయింది. ఒక లకుముకిపిట్ట దాని బాధను చూడలేక ఆ ఎముకను తీసివేసింది. మరొక రోజున అదే పులి మాంసాన్ని తింటుండగా అదే పిట్ట అక్కడకు వచ్చి 'నాకు కొంచెం మాంసం పెట్టవా?' అని అడిగింది. పులి దానిని చూసి 'నీ వెవరవు? నేను మాంసాన్ని నీ కెందు కివ్వాలి?' అని టెక్కుగా ప్రశ్నించింది. పిట్ట వెనుక జరిగిన దంతా చెప్పింది. అది విన్న పులి పకపకా నవ్వి దానితో అంటున్నది. ఏమని?

'ఓ పిట్టా! నీకు లోకరీతి తెలియదులాగా ఉన్నది. చెప్తున్నాను విను. కాయలు కాస్తున్నంత వరకే చెట్టుకి ఆదరణ. తరువాత దాని నెవ్వరూ పట్టించుకోరు. పాల నిస్తున్నన్ని నాళ్లూ యజమాని ఆవుని చక్కగా పోషిస్తాడు. పొదుగు ఎండిపోయాక దాని ముఖమైనా చూడడు. పడవలలో ప్రయాణిస్తున్నంతవరకే ప్రయాణికుడికి సరంగుతో పని. ఆ తరువాత వాడెవడో! వీ డెవడో! అట్లాగే ఇతరులతో పని ఉన్నంతవరకే వారిని గౌరవించటం. పని పూర్తి అయ్యాక వారితో పనే లేదు. పక్షీ! నీ విషయమూ అంతే! నీతో నాకు పనేమిటి? వెళ్లు వెళ్లు!'

నిజంగా లోకరీతి ఈ విధంగానే ఉన్నది. కానీ ఇది కృతఘ్నుల లక్షణం. మన మాచరించ తగినది కాదు. అందువల్లనే కవి ఈ విషయాన్ని పెద్దపులి చేత చెప్పించాడు. ప్రజ్ఞసంభావిత కావ్యదక్షుడైన మంచన (క్రీ.శ. 14శ.) వ్రాసిన ఈ పద్యం అతని 'కేయూరబాహుచరిత్ర' కథాకావ్యం లోనిది (3-127).

**14. పద్య.సత్కారం**

మ. 'కృతికిన్ మీ గురు వే మొసంగె?'నని మి మ్మేరేని ప్రశ్నింప 'స
త్కృతి మా కిట్టిలొసర్చె మా గురు'వటం చీ పద్యముల్ చూపుఁ డ
ప్రతిమప్రజ్ఞులు సత్కవీశ్వరులు 'విద్వాంస్తుష్ట'యన్ వాక్యమున్
స్మృతి కెక్కించుక మిమ్ము మెత్తురు కదున్ మీ పూన్కి కగ్గించుచున్.

పింగళి, కాటూరికవులు తమ 'సౌందరనంద' కావ్యాన్ని తమ గురువు గారైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారికి (1870-1950) అంకిత మిచ్చారు. ఆయన దానిని స్వీకరించి వారి నాశీర్వదిస్తూ ప్రశంసిస్తూ ఏడు పద్యాల నాశువుగా చెప్పారు. వాటిలో ఈ పద్య మొకటి.

'మీరు మీ కావ్యాన్ని మీ గురువుగారి కంకిత మిచ్చారు కదా! ప్రతిఫలంగా ఆయన మీ కే మిచ్చారు?' అని ఎవరైనా మిమ్మల్ని ప్రశ్నించారనుకోండి. 'ఇదిగో! మమ్మల్ని ఈ విధంగా సత్కరించా'రని ఈ పద్యాలను చూపించండి. ఆ అడిగిన వాళ్లు మంచి ప్రజ్ఞ కలిగినవారు, సత్కవీశ్వరు లైనట్లయితే మిమ్మల్ని మెచ్చుకొంటారు. 'మంచిపనే చేశారోయి!' అని మీ ప్రయత్నాన్ని ప్రశంసిస్తారు. ఎందుకంటే సరసులైన విద్వాంసు లల్పసంతోషులు. చిన్న సత్కారానికే సంతుష్టిని పొందుతారని పెద్ద లన్నారు కదా!

మన పట్ల అమితమైన అభిమానం కలిగినవారు ఏ సందర్భంలో నైనా మన కొక వస్తువు నిచ్చినట్లయితే వారు ఏ మిచ్చారు? ఎంత విలువైన దాని నిచ్చారు? అని కాదు చూడవలసింది. ఎంత ప్రేమతో ఇచ్చా? రనేదే ముఖ్య మంటున్న ఈ పద్యం పింగళి, కాటూరి కవులు (పింగళి లక్ష్మీకాంతం గారు 1894-1972, కాటూరి వేంకటేశ్వరరావుగారు 1895-1962) రచించిన 'సౌందరనందం' ఖండకావ్యానికి చివర అనుబంధంగా ఉన్న 'కృతిస్వీకారం' లోనిది (6).

**(మిగతా వచ్చేవారం)**

'మధురవక్త'
డా౹౹ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
(గోల్డ్ మెడలిస్ట్)తెలుగు లెక్చరర్ -
రిటైర్డ్ - 89785 25456





# రాజసానికి... రక్షణకు చిహ్నం - తలపాగా

**అనాదిగా భారతీయ జీవన శైలిలో, సంస్కృతి సాంప్రదాయాలతో మమేకమైన ఒక వస్త్రాభరణం తలపాగా. రాజసాన్ని ప్రదర్శించే చిహ్నంగా ఆనాటి రాజులు, రాణిల తలపై మెరిసే తలపాగా, ఆనాటి వైభవాన్ని చాటి చెప్పేది.. సామాన్యుడి తలపై ఉండే తలపాగా ఎండ వేడిమి నుండి, వర్షం నుండి, చలిగాలులు నుంచి రక్షించే కవచంగా ఆనాటి నుంచి నేటి వరకూ భారతీయుల జీవన విధానంలో ఇమిడి ఉన్నది అంటే అతిశయోక్తి కాదు. దాదాపు దేశంలో అన్ని పేద, సామాన్య కుటుంబాల్లో సాధారణంగా మగవారు తలపై ధరించే వస్త్రం తలపాగా...ఆ విధంగా తలపాగాతో ప్రతీ భారతీయునితో విడదీయరాని అనుబంధం ఉంది.**





(ఐ.ప్రసాదరావు 6305682733)

సింధూ నాగరికత కాలంలోనే ఆనాటి ప్రజలు తలపాగా ధరించినట్లు త్రవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. అదే విధంగా వివిధ చెక్కబడిన రాతి శిల్పాలు పరిశీలిస్తే తలపాగా ఔన్నత్యం కనపడుతుంది. వేద కాలంలో పాలించే రాజులు రాణులు తలపాగా ధరించినట్లు చరిత్ర చెబుతోంది. రాజదర్పంగా, తలకు కిరిటింగా తలపాగా శతాబ్దాల తరబడి తన ప్రాశస్త్యాన్ని ప్రదర్శించింది. యోధులు, ప్రభువులు, మేధావులు వంటి వారు కూడా ఆ రోజుల్లో తలపాగా ధరించినట్లు తెలుస్తోంది. సామాన్య ప్రజలు కూడా తలకు రక్షణగా తలపాగా ధరించడం దేశంలో చాలా చోట్ల ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్ లో ఎండ తీవ్రత తగలకుండా ఉండేందుకు తలపాగా ( పగ్రీ) ధరిస్తారు. రాజస్థాన్ లో తలపాగాలు ప్రత్యేకమైన ఆభరణాలతో తయారు చేస్తారు. ధరిస్తారు. పంజాబ్ లో దాదాపు అందరూ తలపాగా ధరిస్తారు. ఇదొక మత ఆచారంగా కూడా పాటిస్తారు. దస్తార్ పేరుతో పంజాబీలు తలపాగా ధరిస్తారు.

లిలిలి భారతదేశంలో కేశ సౌందర్యానికి పురుషులు, మహిళలు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. మహిళలు ఒత్తుగా, పొడవైన జుట్టు ఉండాలి అని కోరుకుంటారు. కేశ సంరక్షణకు అనాదిగా అనేక నూనెలు, ఔషదాలు వాడుతూ ఉంటారు. కేశ అలంకరణలో భాగంగా తలపాగా కూడా ప్రముఖ పాత్ర పోషించింది.

(మిగతా 8వ పేజీలో)

( 7వ పేజీ తరువాయి)

వివిధ నృత్యాల్లో అలంకరణ కోసం తలపై తలపాగా, ఆభరణాలు అలంకరిస్తారు. ఇక భారతదేశంలో చాలా రాష్ట్రాల్లో పెళ్లి సమయంలో తలపాగా ధరిస్తారు. ఈ సాంప్రదాయం అనాదిగా వస్తోంది. తలపాగా అనేది గౌరవానికి, హుందాతనానికి, సమాజంలో స్టేటస్ కు చిహ్నంగా కొనసాగుతూ ఉన్నది. ప్రాంతాల వారీగా, కులాల వారిగా, వృత్తులు పరంగా రకరకాల తలపాగాలు ధరించుట జరుగుతుంది. పెటా పేరుతో కర్నాటక, పెహటా ( పటకా) పేరుతో మహారాష్ట్ర, పోచంపల్లి నేతతో తెలంగాణలో తలపాగాలు ధరించుట జరుగుతుంది. వివిధ సందర్భాలు వివాహం, పండుగలు, వేడుకలను బట్టి తలపాగాలు ధరించుట జరుగుతుంది. భారతీయ సంస్కృతిలో, మత క్రతువుల్లో, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, వివిధ సందర్భాలలో తలపాగా ధరించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అంతేకాకుండా సామాన్య ప్రజలకు తలకు రక్షణగా, వడదెబ్బ తగలకుండా రక్షణ కవచంగా ఉపయోగపడుతుంది.


ఈ విధంగా వేద కాలం నుంచి నేటి వరకూ భారతీయుల అలంకరణలో తలపాగా ప్రముఖ పాత్ర వహిస్తుంది. అందానికి, ఆచారాలకు, రక్షణకు, రాజదర్పానికి ప్రతీకగా తలపాగా చిహ్నంగా కొనసాగుతూ ఉన్నది. మారుతున్న కాలంతో తలపాగా కూడా నూతన ఒరవడులు అందిపుచ్చుకుంది. రకరకాల తలపాగాలు, రకరకాల రంగులు, స్టైల్స్ తో చూపరులను ఆకట్టుకుంటుంది. వివిధ ఆభరణాలు తలపాగాలపై అలంకరిస్తూ ఆకర్షణీయంగా తయారవుతున్నాయి. రాణీలు కూడా గత కాలంలో తమదైన శైలిలో తలపాగాలు ధరించినట్లు ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీర వనితల చిత్రపటాలను బట్టి తెలుస్తోంది. మొఘలుల కాలంలో కూడా తలపాగా నూతన ఒరవడులు సంతరించుకుంది. ఇక మన స్వాతంత్ర్య సమర యోధులు బాల గంగాధర్ తిలక్, మంగల్ పాండే, లాలా లజపతి రాయ్, తాంతియా తోపే, గోపాలకృష్ణ గోఖలే, దాదా బాయ్ నౌరోజి వంటి వారు,



సంఘ సంస్కర్తలు రాజా రామ్మోహన్ రాయ్,. వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు వంటి వారు కూడా తలపాగా ధరించిన ధీరులే.. ఇక రాజకీయ నాయకులు కూడా తరచూ వివిధ రకాల తలపాగా ధరించడం చూస్తూనే ఉంటాం.. ఓటర్లను ఆకర్షించేందుకు, వేడుకల్లో ఆయా ప్రాంతాల సందర్శన సందర్భంగా వివిధ తలపాగాలు ధరిస్తారు... ఈవిధంగా భారతీయుల జీవన సరళిలో రాజులు, చక్రవర్తులు నుంచి సామాన్య మానవుని వరకూ సందర్భానుసారంగా తలపాగా విశిష్టమైన పాత్ర పోషించింది అని మన చరిత్ర ఉద్ఘోషిస్తుంది...

# శ్వేతపత్రం అంటే ఏమిటి? దాన్ని ఎందుకు ప్రవేశపెడతారు?

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో శ్వేతపత్రాల హవా సాగుతోంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్ట్, అమరావతి, విద్యుత్ రంగంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలను విడుదల చేశారు. అదే విధంగా ఆర్థిక శాఖపై కూడా శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధమవుతోంది చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం. కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ చూసినా ఈ శ్వేతపత్రాల చర్చలే జరుగుతున్నాయి. వీటిని గత ప్రభుత్వం పాల్పడిన అవినీతిని ప్రజల ముందు ఉంచడానికి విడుదల చేస్తున్నామని నారా చంద్రబాబు నాయుడు చెప్తున్నారు. ఇదే విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్ని రోజుల పాటు ఈ శ్వేతపత్రాలను తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల మోదీ ప్రభుత్వం కూడా యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై ఎన్‌డీఏ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే అసలు శ్వేతపత్రాలు అంటే ఏంటి? అందులో ఏముంటుంది? అది ఎప్పుడు విడుదల చేస్తారు? దాని వల్ల లాభమేంటి? అన్న అనుమానాలు చాలా మందిలో తలెత్తుతున్నాయి.




**శ్వేతపత్రం అంటే**

ఏదైనా ఒక అంశంపై రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే సాధికారిక నివేదిక లేదా మార్గదర్శక పత్రాన్నే శ్వేతపత్రం అంటారు. ఇందులో ఏ అంశాన్నయితే ప్రస్తావించారో దానికి సంబంధించి పూర్తి వివరాలు ఉంటాయి. ప్రభుత్వ అధికారిక సమాచారంతో రూపొందించే వాస్తవ నివేదికనే 'శ్వేతపత్రం' అని అంటారు. సాధారణంగా ఒక అంశంపై ప్రభుత్వం తన విధానాలు చెప్తూ.. దానిపైన అభిప్రాయాలను ఆహ్వానించడానికి శ్వేతపత్రాన్ని ఉపయోగించవచ్చు. అదే విధంగా ఒక బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు దానికి సంబంధించి పూర్తి వివరాలను పొందుపరిచి శ్వేతపత్రం రూపొందించి విడుదల చేస్తారు. తద్వారా సదరు బిల్లుకు సంబంధించిన వివరాలను ప్రజలకు అందించడం జరుగుతుంది.

దీంతో పాటుగా ప్రస్తుతం గత ప్రభుత్వం పాల్పడిన అవకతవకలను ప్రజల ముందు ఉంచడానికి కూడా ఈ శ్వేతపత్రాలను ప్రభుత్వాలు వినియోగిస్తాయి. ప్రస్తుతం చంద్రబాబు, ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేసింది కూడా అదే. గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని ఏస్థాయిలో దోచుకున్నాయో అందరికీ అర్థమయ్యేలా చెప్పాలనే తాము శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని వారు బహిరంగంగానే ప్రకటించారు. ఈ శ్వేతపత్రం ఇప్పుడు కొత్తగా ప్రవేశపెడుతున్నది ఏమీ కాదు. శ్వేతపత్రం అనే కాన్సెప్ట్ మనకు స్వాతంత్ర్యం రాకముందు నుంచే వాడకంలో ఉంది.

**తొలి శ్వేతపత్రం అప్పుడే**

ఇప్పటివరకు ఉన్న రికార్డుల ప్రకారం తొలి శ్వేతపత్రాన్ని 1922లో చర్చిల్ ప్రభుత్వం విడుదల చేసింది. చర్చిల్ ప్రభుత్వం విడుదల చేసిన తొలి సమగ్ర నివేదికను శ్వేతపత్రం అని పిలిచారు. దీన్నే చర్చిల్ మెమోరాండం అని కూడా అంటారు. ఇది యూదులపై పాలస్తీనా హింసపై రూపొందించబడింది. దీనిని ఆ దేశంలోని తొలి బ్రిటిష్ హైకమిషనర్ సర్ హెర్బర్ట్ శామ్యూల్ రూపొందించారు. ఆ తర్వాత చట్టపరమైన ప్రతిపాదనలకు బిల్లు రూపం ఇవ్వడానికి ముందు జరిగే వ్యవహారాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించడానికి సిద్ధం చేసే ప్రభుత్వ నివేదికగా బ్రిటన్ పార్లమెంటు శ్వేతపత్రాన్ని నిర్వచించింది. భారత్, కెనడా, అమెరికా లాంటి అనేక ఇతర దేశాలు కూడా దీనినే అనుసరిస్తున్నాయి. ఇప్పటికి కూడా ఇది అమలులోనే ఉంది.

**దీని వల్ల ఉపయోగం**

ప్రభుత్వ పనితీరును ప్రజలు అర్థం చేసుకోవడానికి, ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి ప్రజలు తగిన సూచనలు చేయడానికి ఈ శ్వేతపత్రం ఉపయోగపడుతంది. ప్రభుత్వం తీసుకున్న, తీసుకునే నిర్ణయాలు, అంశాల గురించి ప్రజలు తెలుసుకోగలుగుతారు. వాటిపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలుగుతారు.

# విశిష్ట విశేషాల సమాహారం .... దక్షిణాయనం

భారతీయ పంచాంగము ప్రకృతితో సహజీవనం చేసేది, ఆ కారణంగా చిగుళ్ళతో ప్రారంభమయ్యే ఆకురాలుకాలం తో పూర్తయ్యే సంవత్సరం మనకే ఉంది. చైత్ర మాసం, పౌర్ణమి, తిథి ఇలాంటివన్నీ ఆకాశంలో ప్రత్యక్షంగా కనిపించేవి. మిగిలిన కాలమానాల కు, సంవత్సర గణనా లకు ఆకాశంలో ప్రమాణం ఏమీ లేదు.తేదీలు మాత్రమే గుర్తుపెట్టుకుని తిథి సంస్కృతిని మరిచిపోతే సామాజిక స్థితి చాలా చాలా బాధాకరం.

భారత దేశం లో వేదాంగ మైన జ్యోతిషశాస్త్రం మానవులందరికీ అవసరమైన సహాయాన్ని చేస్తుంది. ఈ జ్యోతిష్య శాస్త్రం జాతక, ముహూర్త, సిద్ధాంత భాగాలే మూడు భాగాలుగా విస్తరించి ప్రచారం లో ఉంది. తరువాత ప్రశ్న శకునాల అనే భాగాలు చేరి పంచ స్కంద సమన్విత శాస్త్రంగా జ్యోతిష్యం అందరికీ శుభ ఫలితాలను అంది స్తోంది.వీనిలో జాతకభాగము, భూత భవిష్యత్ వర్తమాన రూప మైన త్రికాల విషయాలను తెలియజేస్తూ జీవన యాత్రకు తోడ్పడుతుం ది.ముహూర్తభాగము కార్య సిద్ధిని, శుభఫలాలను సమకూర్చి సహాయం చేస్తుంది

సిదంతా భాగము పంచాంగ రూపం గా ఏర్పడి దైనందిన యాత్రలో అనేక విధాలుగా సహాయం చేస్తుంది. ఈ భాగాలన్నీ కాలానికి సంబంధించినవి. సమయ వేత్తలు కాలాన్ని సంవత్సరం, ఆయనం, రుతువు, మాసం, పక్షం, దినం అని ఆరు విధాలుగా విభజించి ధర్మాచరణకు శ్రేయ ప్రాప్తికి మార్గాన్ని చూపినారు.

ఇప్పుడు ముఖ్యంగా అయనం చూసినట్లయితే ఇది రెండు విధాలు

1. ఉత్తరాయణం... సూర్యుని మకరసంక్రమణం మొదలుఆరు రాసుల్లో సంచారం వల్ల ఏర్పడేది ఆ సమయంలో భూమధ్యరేఖకు ఉత్తరంగా సూర్య సంచారం కనిపిస్తుంది

2. దక్షిణాయనం.. సూర్యుని కర్కాటక సంక్రమణం మొదలు 6 రాసుల్లో సంచారం వల్ల ఏర్పడేది. ఆ సమయములో భూమధ్య రేఖకు దక్షిణంగా సూర్య సంచారము కనిపిస్తుంది.

ఈ రెండు ఆయనాలు కలిపితేనే సంవత్సరం అవుతుంది.

జ్యోతిషశాస్త్రం ప్రకారం సూర్యుడు గ్రహాలకు రాజు.అసలు జ్యోతిషంలో ఒక్క గ్రహం రాశి మారటానికి ఒక్కో కాల వ్యవధి వుంటుంది. అంటే చంద్రుడు మేష రాశి నుంచి వృషభరాశికి మారటానికి 2 1/2 రోజులు, అక్కడనుంచి నుంచి మిధునాని కి మారడానికి రెండున్నర రోజులు పడుతుంది. దాదాపు 12 రాశులు మారడానికి నెల రోజుల వ్యవధి పడుతుంది అనుకోవచ్చు. ఇక చూసినట్లయితే రాశి మార్పుకు శనిగ్రహం 2 1/2 సం పడుతుంది. రాహు, కేతువులకి 1 1/2 సం, రవికి నెల రోజులు, గురునికి ఒక సంవత్సరము ఇలా ప్రతి గ్రహానికి కొంత కాల పరిమితి వుంటుంది. అయితే ముఖ్యంగా సూర్యుడు నెలకి ఒక్కో రాశి చొప్పున (మేషాది మీనరాశులు) పన్నెండు రాశులలోనూ పన్నెండు నెలలు సంచరిస్తే మనకి సంవత్సర కాలం పూర్తవుతుంది.

సూర్యుడు ప్రతి నెలలోను ఒక రాశినుండి మరొక రాశిలోకి ప్రవేశిస్తుంటాడు. దీనికే 'సంక్రమణం' అని పేరు.

సూర్యుడు మేష రాశి ప్రవేశాన్ని జ్యోతిష ప్రకారం 'మేష సంక్రమణం' అని, సూర్యుడు వృషభ రాశి ప్రవేశాన్ని 'వృషభ సంక్రమణం' అని సూర్యుడు మిథున రాశి ప్రవేశాన్ని 'మిథున సంక్రమణం' అని సూర్యుడు కర్కాటక రాశి ప్రవేశాన్ని జ్యోతిష 'కర్కాటక సంక్రమణం' అని ఇలా ఏయే రాశుల్లో ప్రవేశిస్తే ఆయా సంక్రమణ కాలంగా చెపుతారు. సంక్రమణం అనే మాటకి 'ప్రవేశించటం' అని చెప్పొచ్చు. సూర్యుడు కర్కాటక సంక్రమణం చేసాడు అంటే సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించాడు అని అర్థం. ఇది సాధారణంగా జూలై 16వ తేదీ సుమారుగా ఈ కర్కాటక సంక్రమణాన్ని 'దక్షణాయన' మని అంటుంటారు. మనకి సంవత్సరానికి అయనములు రెండు. ఒకటి ఉత్తరాయనం, రెండవది దక్షిణాయనం అని చెప్పుకున్నాము కదా ముందే. తర్వాత సూర్యుని సింహరాశి ప్రవేశం సింహ సంక్రమణం, తర్వాత కన్యా రాశి ప్రవేశం కన్యాసంక్రమణం, తులారాశి ప్రవేశం తులాసంక్రమణం ఇలా పన్నెండు రాశులలోనూ సూర్యుడు ప్రవేశిం చే కాలాన్ని ఆధారముగా ఆయా సంక్రమణంగా చెప్తాం. మకర సంక్రమణం(సంక్రాంతి), మకరరాశి ప్రవేశం! అయితే సూర్యుని



మకర సంక్రమణమే 'ఉత్తరాయన పుణ్యకాలం' అంటారుకదా.

సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించినప్పటినుంచి మకరరాశిలోకి ప్రవేశించేంతవరకు వుండే కాలం దక్షిణాయనం. ఈ ఆయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణంగా సంచరిస్తాడు. దేవతలకు ఉత్తరాయణం పగలు, దక్షిణాయనం రాత్రిగాను చెప్తారు. అదేవిధంగా ఉత్తరాయణం దేవతలకు, దక్షిణాయనం పితృదేవతలకు ప్రీతికరమని చెబుతారు. దక్షిణాయన సందర్భంగా సంక్రమణ స్నానాలు చేయడం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడంతోపాటు దేవత ఆరాధన లు చేయడం. దక్షిణాయనంలో పిండ ప్రదానాలు,పితృ తర్పణాలు చేయడం,సాత్వికాహారం భుజించటం మంచి ఫలితాన్నిస్తాయి. సూర్య గమణాన్నిబట్టి ఏడాదిలో 6 నెలలు ఉత్తరాయణం. 6 నెలలు దక్షిణాయనం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం. కర్కాటక రాశిలోకి ప్రవేశించినప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6 గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిష ములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి.

దక్షిణాయన ఆరంభ కాలమైన ఆషాఢంలో (పౌర్ణమి నాడు చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ సమీపంలోకి వచ్చే నెల) శుద్ధ ఏకాదశి నాడు శ్రీ మహావిష్ణువు పాల కడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు, ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురు పౌర్ణమి గా వ్యవహరిస్తారు, మహా భాగవతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజును వ్యాస పౌర్ణమి అని కూడా అంటారు. ఆ తర్వాత మాసాల్లో వరలక్ష్మీవ్రతం,రాఖీపండుగ శ్రీకృష్ణాజన్మ ష్టమి, వినాయక చవితి, దసరా, దీపావళి, శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక, మార్గశిర మాసాలు, ధనుర్మాసం ఇవన్నీ దక్షిణాయనంలోనే వస్తాయి.

ఆషాఢమాసంలో సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించడం ఖచ్చితంగా జరుగుతుంది. కర్కాటక రాశి ప్రవేశంతో దక్షిణాపథంవైపు సూర్యుడు పయనమవుతాడు. దక్షిణాయనంలో చేసే పితృసంబంధ కర్మలు నేరుగా ఆ పితృ దేవతలకుచెందే ఉత్తమమైనవి సరాసరి ఆ పితృదేవతలకు సకల నరకాలనుండి తొలగిస్తాయి.దక్షిణాయనంలో దేవతా ప్రతిష్ఠ, గృహ ప్రవేశం, ఉపనయనం, వివాహ కార్యాల్లాంటి శుభ కార్యాలను చేయడం మంచిది కాదంటారు. కానీ దక్షిణాయనంలో ఉగ్రదేవతా రూపాలను (అంటే సప్త మాతృకలు, భైరవ, వరాహ, నృసింహ, మహిషాసుర మర్దని, దుర్గ లాంటి) దేవతామూర్తులను ప్రతిష్ఠించవచ్చని వైఖానస సంహిత చెబుతోంది. కర్కాటక సంక్రమణ సమయంలో అంటే దక్షిణాయన ప్రారంభంలో పుణ్య స్నానాలు, జపతపాలు చేయడం ఎంతో మంచిది. ఆనాడు కులదైవాన్ని, లేదా శ్రీ మహా విష్ణువును పూజిస్తే ఆ ఏడాదంతా చేసే దోషాలు, పాపాలు వైదొలగుతాయి. వారి పితృదేవతలు స్వర్గాది సుఖలోకాలను చేరుకుంటారు.సంక్రమణ కాలంలో చేసే పుణ్య స్నానాల వలన రోగాలు నివారించబడడమే కాకుండాఅనేక ఇబ్బందులు కూడా నిర్మూలిస్తాయి

అయనమ్ అంటే ప్రయాణం. ప్రాచీన భారతీయులు ఈ దృగ్విష యాన్ని ఉత్తరాయణం మరియు దక్షిణామం అని అభివర్ణించారు. ఉత్తరాయణం 6 నెలలుదేవతలకు ఒకే రోజు, దక్షిణాయనం 6 నెలలు దేవతలకు ఒకే రాత్రి. ఈ విధంగా మానవులకు ఒక సంవత్సరం దేవతలకు 1 రోజుకు సమానం.

ముఖ్యంగా ఈ సంక్రమణ కాలం జపాలు కు, సాధకులకు మంచి అద్భుత ఆధ్యాత్మిక ఫలితాలనిస్తుంది అనటంలో సందేహంలేదు . ఈ సమయంలో చేసే దానాలు కూడా విశేష ఫలాలనిస్తాయి. అందుకే సర్వులకు మోక్షానికి ఉత్తరాయణం, ఇహానికి దక్షిణాయనం ప్రతీకలుగా భావిస్తారు. ఈరోజు పుణ్యనదీ స్నాన, దాన, జప, హోమం అక్షయ ఫలాన్ని ఇస్తుంది అనటంలో అతిశయోక్తి లేదు. శాస్త్రీయంగా చూసినా కూడా సూర్యకిరణాలు దక్షిణాయం నెలల్లో చాలా తక్కువ. ఇది మానవులలో రోగనిరోధక శక్తినితగ్గించి మరియు జీర్ణవ్యవస్థ లో మార్పు తెస్తుంది . మనం పాటించే సంప్రదాయాలు మరియు ఆచారాలు ఉపవాసం, ధ్యానం మరియు భగవంతుని ఆరాధన అత్యుత్తమమార్గాలు.

ఈ ఆచారాలుపాటిస్తే శరీరంలో రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాం. వ్యాధులు దరిచేరవు.

డా. ఈడుపుగంటి పద్మజారాణి
091 93930 07560, 091 98492 50852

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# తొలి ఏకాదశి- చాతుర్మాస్య వ్రత విశిష్టత




భారతదేశంలో ఎవరిని కదిపిన, ఏ మంచి పని ప్రారంభించ లనుకున్నా ముందుగా చూసేది దశమి, ఏకాదశులకోసం అంటే అలా ఎదురు చూడటం సాధారణ ప్రజలకు అలవాటు. ఏడాది పొడుగునా ఉండే 24 ఏకాదశుల్లో ఆషాడ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశిగా పరిగ ణిస్తారు. పూర్వకాలంలో ఈ రోజునే సంవత్సరారంభంగా పరిగణించే వారు. వానకారు మొదలైతే అనారోగ్యాలు తలెత్తడం సహజం. చాతుర్మాస్య వ్రతం హిందువులు ఆచరించే ఒక వ్రతం. ఈ వ్రతంలో భాగంగా వర్షాకాలంలో నాలుగు నెలలపాటుఒకపూట మాత్రమే భోజనంచేస్తారు.. లంఖణం పరమ ఔషధం అనే మాట అందరూ వినే ఉంటారు. ఆధ్యాత్మిక ఉపవాస దీక్షకు నాంది తొలి ఏకాదశి. మనము గమనించి నట్లయితే సాధారణంగా ఉత్తరాయణం లో కన్నా దక్షిణాయనల్లోనే పండగలు ఎక్కువ. అందునా ప్రధానమైన ఆషాఢ శుద్ధ ఏకాదశిని శయనైకాదశి అంటారు. ఆరోజున శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి (ఉత్థాన ఏకాదశి) రోజున మేల్కొం టాడు. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు.

ఈ కాలంలో యతులు ఎటువంటి ప్రయాణాలు తలపెట్టక ఒకేచోట ఉండి అనుష్టానం చేస్తారు. చాతుర్మాస్య వ్రతం ప్రాచీన కాలం నుండి హిందూదేశంలో మునీశ్వరులు పాటిస్తూ వస్తున్న వ్రతం. చాతుర్మాస్య వ్రతం అంటే నాలుగు నెలల కాలం అనుష్ఠించవలసిన వ్రతమని అర్ధం. కొందరు రెండు నెలల కాలమే ఈ వ్రతాన్ని పాటించి అర్ధచాతుర్మాస్యం అనే పేరుతో చేస్తారు. ఈ వ్రతాచరణకు స్త్రీ, పురుష భేదం కానీ, జాతి భేదం కానీ లేదు. వితంతువులు, యోగినులు మొదలైనవారెవరైనా చేయవచ్చును. ఇది హిందువులతో పాటు జైన, బౌద్ధ మతస్థులు ఉండే సమాజములోను ఆచరణలో కనిపిస్తుంది. ఈ వ్రతాన్ని ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు గానీ, వీలుకాకపోతే కటక సంక్రాంతి, కాకపోతే ఆషాఢ శుద్ధ పూర్ణిమ నుంచి విధిగా ఆచరించాలని చెప్తారు.

**చాతుర్మాస్యం:**

ఈ చాతుర్మాస వ్రతం ఆచరించడమనేది ఇటీవలి కాలంలో వచ్చినది కాదు. యుగ యుగాలుగా ఆచరణలో ఉందని భవిష్య, స్కాంద పురాణాలలోని కథనాల వలన అవగతమవుతుంది. ఒకప్పుడు ఇప్పటిలాగా కాక నాలుగు నెలలుపాటు కొనసాగే ఋతువులు మూడే ఉండేవట. అనంతర కాలంలో రెండేసి నెలల పాటు ఉండే ఆరు ఋతువులుగా అవి మారాయి. తొలినాళ్ళలో వర్ష, హేమంత, వసంత – అనే మూడు ఋతువులు మాత్రమే ఉండేవి. వర్ష ఋతువుతోనే సం వత్సరము ఆరంభామవుతూ ఉండేది . ఈ కారణం వల్ల సంవత్సరానికి "వర్షం" అనే పేరు వచ్చింది. సంవత్సరానికి మూడు ఋతువులున్న ఆ కాలములో ఒక్క ఋతువు ప్రారంభంలో ఒక్కో యజ్ఞం చేస్తుండేవారు. ఆషాఢ పూర్ణిమ నుండి వరుణ ప్రఘాస యజ్ఞం, కార్తీక పూర్ణిమ నుండి సాకమేద యజ్ఞం, ఫాల్గుణ పూర్ణిమ నుండి వైశ్వ దేవయజ్ఞము చేస్తూ ఉండేవారు. ఆ నాటి ఆషాఢంలో చేసే యజ్ఞమే అనంతర కాలం నాటికి చాతుర్మాస్య వ్రతము గా మారి ఆచరణలోకి వచ్చిందని పెద్దలు చెబుతున్నారు. చాతుర్మాస వ్రతము పాటించేవారు. ఆహార నియమాలలో భాగంగా శ్రావణ మాసంలో ఆకుకూరలను, భాద్రపద మాసంలో పెరుగును ఆశ్వయుజ మాసంలో పాలను కార్తీక మాసంలో పప్పు పదార్థాలను విధిగా వదిలి పెట్టాలి. వాటిని ఆహారముగా ఏ మాత్రము స్వీకరించ కూడదు. పాత ఉసిరి కాయ పచ్చడి మాత్రం వాడవచ్చును. ఈ ఆహార నియమాలన్నీ వాత, పిత్త, శ్లేష్మ సంబంధ రోగాల నుంచి కాపాడు కోవటానికి బాగా ఉపకరిస్తాయి. ఇలా ఎటు చూసినా చాతుర్మాస్య వ్రతదీక్ష అనేది – మానవాళి ఆరోగ్య పరిరక్షణకు ఉపకరించే ఉత్తమ వ్రత దీక్ష అని పురాణ వ్మాయం వివరిస్తోంది

**"ఏకభుక్త మధశ్శయ్యా బ్రహ్మచర్య మహింసనమ్**
**వ్రతచర్యా తపశ్చర్యా కృచ్ఛచాంద్రాయణాదికమ్**
**దేవపూజా మంత్రజపో దశైతే నియమాః స్మృతాః"**

**వ్రత నియమాలు:** చాతుర్మాస్యాన్ని అన్ని ఆశ్రమాల (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస) వారు పాటించవచ్చు. కుల, వర్గ నియమాలు కానీ, లింగ వివక్ష కానీ లేదు. చాతుర్మాస్య వ్రతం ప్రధానంగా ఆరోగ్యానికి సంబంధించినది. చాతుర్మాస్య వ్రతం పాటించే విధానం ఆషాడ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకూ మొదటి నెలలో కూరలు, రెండవ నెలలో పెరుగు, మూడవ నెలలో పాలు, నాల్గవ మాసం లో పప్పు దినుసులూ తినకూడదు. భాగవతం వంటి గాథలు వింటూ ఆధ్యాత్మిక చింతనతో ఈ నాలుగు నెలలూ గడపాలి. వైరాగ్యాన్ని అలవరుచుకునేందుకు ఎక్కువగా సన్యాసులు, వృద్ధులు ఈ వ్రతం ఆచరిస్తారు.

ఈ నాలుగు మాసాలు తాను నివసించే గ్రామం యొక్క ఎల్లలు దాటరాదు.

ఈ కాలంలో అరుణోదయవేళ స్నానం చేయడం అవసరం.

వ్రతకాలంలో బ్రహ్మచర్యం, ఒంటిపూట భోజనం, నేలపై నిద్రించడం, అహింస పాటించాలి.

ఇష్టదేవతలకు చెందిన దివ్యమంత్రాన్ని అక్షరలక్షలుగా జపించాలి.

ఏదైనా ఒక ఉపనిషత్తును పఠించాలి.

భగవద్గీతలోని కొన్ని అధ్యాయాలను కంఠస్థం చేయాలి.

యోగసాధన చేయడం శ్రేయస్కరం.

దానధర్మాది కార్యాలు విశేష ఫలాన్నిస్తాయి.

**వ్రత వృత్తాంతము...**

చతుర్మాసాలు అంటే, ఆషాఢ శుక్ల ఏకాదశి నుంచి కార్తీక శుక్ల ఏకాదశి వరకు గల సమయం నాలుగు నెలలు. ఆషాఢ, శ్రావణ, బాద్రపద, ఆశ్వయుజ మాసాల్లోని ఏకాదశులు ఎంతో పవిత్రమైనవి. ఇందులో మొదటిది దేవశయన ఏకాదశి. చివరిది దేవ ఉత్థాన ఏకాదశి. క్షీరసాగరంలో శ్రీ మహావిష్ణువు ఈ నాలుగు నెలలు శయనిస్తాడు. విష్ణువు శయనించే కాలంలో సాధకులు భూశయనం చేయటం, ఆకుకూరలు, వెల్లుల్లి, సొరకాయ, టమాట, ఆవనూనెల సేవనం మానివేయటం, నిరంతర జప, తప, హెూమ, పురాణ కథా శ్రవణాల్లో కాలం గడపటం, రోజూ ఒకే పూట భోజనం చేయటం, ఏకాదశులలో పూర్తిగా ఉపవాస దీక్ష చేయటం వంటి దీక్షా ధర్మాలను పాటిస్తారు. పీఠాధిపతులు, దీక్షితులు ఒకే స్థానంలో నివసించటం, క్షురకర్మలు నిషేధించడం వంటి నియమాలు పాటిస్తారు. శ్రావణ, బాద్రపద మాసాలు గృహస్థుల నియమాలకు సరైనవని పద్మపురాణం తెలుపుతోంది. బాద్రపద కృష్ణ ఏకాదశిని అజా ఏకాదశి అంటారు. ఇది సమస్త పాపాలను తొలగిస్తుందంటారు. హరిశ్చంద్ర మహారాజు సత్యం, ధర్మం తప్పక తన భార్యకు దూరమై అనేక ఇక్కట్ల పాలైనప్పటికీ చాతుర్మాస్య వ్రతాన్ని మరువలేదని, చివరికి విజయం చేకూరిందని చెబుతారు. చాతుర్మాస్య దీక్షలో గోపద్మవ్రతం గురించి మూడు పురాణ గాథలు వాడుకలో ఉన్నాయి.

**నారేళ్ళనాచి కథ:**

ఒకసారి కైలాసంలో శివునిచేతి మెత్తదనాన్ని చూసిన పార్వతి– చేయి మెత్తగా, మృదువుగా ఉండటానికి కారణం అడిగింది. పరోపకారం చేయడం వలన చేతులు మెత్తగా ఉంటాయని శివుడు చెప్పాడు. అందుకే 'ఎముక లేని చెయ్యి' అని దానం చేసేవారిని వర్ణిస్తారు. పార్వతికి పరోపకార సేవ చేయాలనే కోరిక కలిగింది. మారువేషంతో భూలోకానికి వెళ్లింది. నారేళ్ళనాచి అనే పేరు గల గర్భిణికి చేయూతనిచ్చి, సేవచేసి, 11 రోజుల తరువాత సకలైశ్వర్యాలు కలగజేసి, చాతుర్మాస్య గోపద్మ వ్రతాన్ని తెలిపి అంతర్ధానమైపోయింది. అయిదేళ్ళ తరువాత అమ్మకు నారేళ్ళనాచి పరిస్థితిని తెలుసుకోవాలనిపించింది. అప్పుడు నారేళ్ళనాచి గోపద్మవ్రత ఉద్యాపన చేసుకొంటోంది. పార్వతి ఓ ముసలమ్మ రూపంలో వెళ్ళి మంచి నీళ్ళడిగింది. నారేళ్ళనాచి కోపంతో ఆమెకు బయట తొట్టిలో నీరిమ్మని తనవారితో చెప్పింది. అవమానపడిన పార్వతి తిరిగి శివుని దగ్గరకు వెళ్ళి ఆమెకు ఐశ్వర్యం లేకుండా చేయాలని కోరింది. అది సాధ్యపడదన్నాడు శివుడు. విష్ణువూ తానేం చేయలేనన్నాడు. చివరికి నారదుడు వెళ్ళి నారేళ్ళనాచికి తెలిపాడు. తన అపరాధాన్ని గ్రహించిన భక్తురాలు వెంటనే పార్వతీ పరమేశ్వరులకు పాయసం, గణపతికి ఉండ్రాళ్ళు నైవేద్యం చేసి, క్షమించమని కోరింది. పార్వతీ పరమేశ్వరులు ఆమెకు సకలైశ్వర్యాలు అందజేశారు.

**రాజు రాణి కథ:**

ఇదే విధంగా ఒక రాజు సంతానం లేని కారణంగా చెరువులు, బావులు తవ్వించడం, బాటలు వేయించడం, బాటల పక్క చెట్లు నాటించడం చేసి తన రెండో భార్యకు అయిదుగురు సంతానాన్ని పొంది, తన మొదటి భార్యలో గల ఈర్ష్య వల్ల రెండో భార్య గోపద్మ వ్రతానికి భంగం కలగకుండా చేశాడు. మరో కథలో యముడు గోపద్మ వ్రతం చేయనివారి వెన్నెముక చర్మాన్ని తెచ్చి జయభేరి మోగించాలని తన భటులను కోరాడట.

**సుభద్ర వ్రతాచరణ:**

తన చెల్లెలు ఈ వ్రతాన్ని చేయలేదని తెలిసిన శ్రీకృష్ణుడు వెంటనే సుభద్ర వద్దకు వెళ్ళి అయిదేళ్ళ వ్రతాన్ని ఒకేరోజు జరిపించాడట. దాంతో యమభటులకు జయభేరిని మోగించడానికి చర్మం లభించలేదట. తూర్పు దిక్కుకు తలపెట్టి పడుకొన్న ఓ జీవి వెన్నెముక చర్మాన్నైనా తెచ్చి జయభేరి మోగించాలన్నాడట యముడు. అప్పుడు ఓ దున్నపోతు అలా నిద్రిస్తుండటం చూసి దాని చర్మాన్ని తెచ్చి డోలు వాయించారని కథనం.

**ముత్తైదువులు:**

చాతుర్మాస్య గోపద్మ వ్రతంలో ముత్తైదువలు తొలి ఏకాదశి నుంచి ప్రతిరోజు కొన్ని చొప్పున 1100 వత్తులు, 11 వందల ముగ్గులు పెట్టుకుంటారు. అయిదేళ్ళు నోముకున్నాక కన్నెముత్తైదువకు పసుపు, కుంకుమ, గాజులు, బట్టలు, భోజనం, బియ్యం, నువ్వుపిండి పెట్టి నమస్కరిస్తారు. గణపతికి ఉండ్రాళ్ళు నివేదన చేస్తారు. దూర్వాలతో గౌరమ్మను పూజించి, తులసికోటవద్ద దీపం వెలిగిస్తారు. జామపండ్లు, సీతాఫలాలు, చెరకు, ఖర్జూర పండ్లు వంటివాటితో కన్నె పిల్లల ఒడినింపి, గౌరమ్మకు నమస్కరిస్తారు. పరోపకారం, సేవాభావం, పరులను గౌరవించడం, చాతుర్మాస్య నియమాలు పాటించడం– మానవాళికి ఎంతో శుభం, ఆనందం చేకూరుస్తాయని అందరి నమ్మకమ్

**డా. ఈడుపుగంటి పద్మజారాణి**
**౦91 93930 07560, ౦91 98492 50852**

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com




# 14.7.2024 నుంచి 20.7.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోపాత రుణములు చెల్లిస్తారు. శత్రువులపై విజయం సాధిస్తారు ఆత్మ విశ్వాసం పెరుగు తుంది. విద్యార్థులు పోటీ పరీక్షల కొరకు బాగా ప్రిపేర్ అవుతారు. తల్లి తరపు బంధువులతో ఒక విషయాన్ని చర్చిస్తారు. వారం మధ్యలో గౌరవము గుర్తింపు పెరుగుతుంది. అవార్డులు అందుకుంటారు. ఆత్మీయుల గ్రామానికి ప్రయాణం చేస్తారు. పెద్దలతో విభేదాలు రాకుండా ముందుకు వెళ్లాలి. వృత్తిపరంగా భాగస్వామితో తాత్కాలికంగా ఎడబాటు. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. నూతన సంస్థలలో వృత్తుల కొరకు ప్రయత్నాలు చేస్తారు. సంతానానికి ప్రభుత్వపరమైన వృత్తి కొరకు ప్రయత్నాలు ముందుకు వెళతాయి. వారము చివరిలో కొత్త ప్రదేశాలలో వృత్తిపరంగా ఆకస్మిక అవకాశాలు, స్త్రీ సంతాన సహకారం బాగుంటుంది.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో సంతానం పోటీ పరీక్షల్లో అధిక శ్రద్ధ చూపిస్తారు. ఆత్మీయుల కొరకు ఆకస్మిక ఖర్చు ఉంటుంది. స్పెక్యులేషన్ మొదలైన విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. సభలు సమావేశాల్లో పాల్గొంటారు. వారం మధ్యలో సంతానానికి వృత్తిపరమైన విషయాలలో నూతన అవకాశాలు, ప్రభుత్వపరమైన వృత్తి కొరకు ప్రయత్నం చేసే వారికి సహకారం అందుతుంది, ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఆశించిన ఫలితాలు పొందుతారు. పాత బకాయిలు కొంతవరకు చెల్లిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. కృషి శీలత పెరుగుతుంది, రహస్య శత్రువులపై విజయం సాధిస్తారు. వృత్తిలో అభివృద్ధితోపాటు కొత్త అవకాశాలు ఆనందాన్ని కలిగిస్తాయి. వారం చివరిలో వివాహ ప్రయత్నాలు లో కొంత ఆలస్యాలు అవరోధాలు చికాకు తెప్పిస్తాయి.



## మిథున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో గృహంలోని వాతావరణం ఆశించిన స్థాయిలో సంతృప్తిని ఇవ్వదు. విద్యార్థులు విద్య పై ఆసక్తిని, జ్ఞాపక శక్తిని పెంచుకోవాలి. నూతన అంశాలు తెలుసుకుంటారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ మంచిది. విద్యార్థుల హాస్టల్ వసతి కొరకు ప్రయత్నాలు బాగా చేస్తారు. వారం మధ్యలో భాగస్వామి, సంతానమునకు ప్రభుత్వపరమైన అవకాశములు కొరకు ప్రయత్నాలు, ఆలోచనలు ఫలిస్తాయి. ఉపాసన బలం పెరుగుతుంది. ఆధ్యాత్మిక అంశముల కొరకు చేయు ప్రయత్నాలు యందు అవరోధాలు అధిగమించే ప్రయత్నాలు చేయాలి. ఎంతో కాలం ఎదురు చూస్తున్నా ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకోగలుగుతారు. వారం చివరిలో ధైర్యం పెరుగుతుంది



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోచిన్న ప్రయాణాలు చేస్తారు కుటుంబంలో సోదరీ సహకారం బాగుంటుంది, ఆర్థికంగా తండ్రి గారు, విదేశాలలో ఉండే మిత్రులు సహకరిస్తారు. ఉత్సాహంగా ఉంటారు తల్లి తరపు బంధువులను కలుస్తారు, గృహ మార్పుకే ఆలోచనలు చేస్తారు. వాహన కొనుగోలు కొరకై ఆత్మీయులను కలిసి చర్చిస్తారు. వారం మధ్యలో రాజకీయ నాయకుల, ఉన్నతాధికారు లను వృత్తిపరమైన విషయాలలో సంప్రదిస్తారు. పోటీ పరీక్షల కొరకు విద్యార్థులు విశేషంగా కృషి చేస్తారు. వారం చివరిలో సంతాన అభివృద్ధి విషయంలో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. ఆలోచనలు వికసిస్తాయి. కొత్త పెట్టుబడి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఆధ్యాత్మిక బలం పెంచుకునే ప్రయత్నాలు చేస్తారు. ఇష్టమైన వారి కోసం అధికంగా ఖర్చు చేస్తారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో వాగ్దానాల అంశాలలో, ఆకస్మిక ఖర్చులలో నిదానము అవసరం.ఆర్థిక సంబంధమైన విషయాలలో, ఇతరులతో వ్యవహరించే అంశాలలో జాగ్రత్తలు తీసుకుని వలెను. వారం మధ్యలో మిత్రులు తోబుట్టువులు సహకరిస్తారు ధైర్యం పెరుగుతుంది, కుటుంబ వ్యక్తుల ,పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుల సహకారంతో సొంత నిర్ణయాలు తీసుకుంటారు. ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. సంతాన అభివృద్ధి కరంగా ఉంటుంది. సంతానం వారి నిర్ణయాల విషయంలో, మీరు ఆలోచించి ముందుకు వెళ్లడం అవసరం. వారం చివరిలో వాగ్వాదాలకు దూరంగా ఉండాలి. తోబుట్టువులతో కలిసి దీర్ఘకాలికి పెట్టుబడులకై ఆలోచనలు చేస్తారు. ఆరోగ్యముపై తగ్గిన శ్రద్ధ అవసరము. ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు,



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలోమీ ఆలోచనలు మీకు విస్మయాన్ని కలిగిస్తాయి. ఆర్థిక అంశాలు అనుకూలంగా ఉంటాయి. సంఘంలో గౌరవనీయమైన వ్యక్తుల, విదేశీ వ్యక్తుల నూతన పరిచయాలు, పలుకుబడి పెరుగుతుంది. మనసు ప్రశాంతత తక్కువగా ఉంటుంది కొత్త ఆలోచనలు చేస్తారు. వారం మధ్యలో సమయస్ఫూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారు, ఉన్నత పదవులలో పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారంతో కొత్త పెట్టుబడుల కొరకు ఆలోచిస్తారు. బంధుమిత్రులను కలుస్తారు. బ్యాంకింగ్ మొదలైన పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతారు. వారం మధ్యలో ప్రయాణాలు లభిస్తాయి, నూతన పరిచయాలు, ధైర్యం పరాక్రమం పెరగడం, భూ సంబంధ అంశాలలో ఆశించిన ఫలితాలు.వృత్తిపరంగా అభివృద్ధి. సంతానం ఎదురు చూస్తున్నా వార్త అందుతుంది.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన అలసట, ప్రశాంతత తక్కువ, నిద్రలేమి. శారీరక శ్రద్ధ అవసరము. అయినప్పటికీ చురుకుగా ఉత్సాహంగా నిర్ణయాలు తీసుకుంటారు. ఇష్టమైన వస్తువులకు కొనుగోలు కొరకు అధికవ్యయం. వింతగా విడ్డూరంగా మాట్లాడుతూ అందరిని ఆకట్టుకుంటారు. సమయ స్ఫూర్తిగా ఆలోచిస్తారు. వారం మధ్యలో పౌరుషం కోపం కొంత పెరుగుతుంది. నాయకత్వ లక్షణాలు, దర్పంగా ఉంటారు. వ్యాపార రంగంలో వారు సహకరిస్తారు. విద్యార్థులకు అనుకూలం. విదేశీ విద్య కొరకై చేయు ఆలోచనలు కొలిక్కి వస్తాయి. వారం చివరిలో ఆర్థిక విషయాలు గృహ సంబంధ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఎక్కువ రుణముల కొరకు ప్రయత్నాలు చేస్తారు. వస్త్రములు, షాపింగ్ కొరకు ఆకస్మిక ఖర్చులు.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ప్రారంభంలో చాలాకాలంగా ఎదురుచూస్తున్న వార్త అందుకుంటారు. సంతాన అభివృద్ధి కరంగా ఉంటుంది. వాతావరణం అనుకూలంగా ఉంటుంది, చురుకుగా ఉత్సాహంగా ఉంటారు. చిన్ననాటి మిత్రులను కలుస్తారు. సభలకు సమావేశాలకు హాజరు అవుతారు. సమయాన్ని సద్వినియోగపరుచుకుంటారు. దూర ప్రయాణాలు చేస్తారు. ఇష్టమైన ఆత్మీయుల కొరకు అధిక ఖర్చులు చేస్తారు. అవసరమైన వారి కొరకు విరాళాలు ఇస్తారు. విదేశీ ప్రయాణ విషయంలో కొత్త నిర్ణయానికి వస్తారువారం మధ్యలో . విద్యార్థులకు విద్యాసంబంధ ప్రయాణాలు ఉంటాయి. వారము చివరిలో వ్యక్తిగత శ్రద్ధ ఆకర్షణ పెరుగుతుంది. సహకరించరు అనుకున్న వ్యక్తుల సహకారం ఆనందాన్నిస్తుంది. లలిత కళలపై ఆసక్తిని పెంచుకుంటారు. దూర ప్రాంతాల్లో ఉండే గురువుల ఆశీస్సులు అందుకుంటారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలోస్వ గ్రామానికి వెళ్లడానికి ఆలోచనలు చేస్తారు. వారం మధ్యలో వృత్తిలో ఆదాయం అభివృద్ధి, ఉన్నత అధికారుల ప్రశంసలు.వృత్తి పరంగా అభివృద్ధి ఉంటుంది. అలసట బడలిక కొత్త బాధ్యతలు. శక్తివంచన లేకుండా మీ విధానంలో మీరు బాధ్యతాయుతంగా పనులు నెరవేరుస్తారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తుల సహాయ సహకారంతో నూతన నిర్ణయాలకు శ్రీకారం చుడతారు. పడిన కష్టానికి ప్రతిఫలాన్ని పొందుతారు. బ్యాంకింగ్, హోమియో రంగంలో ఉండే వారికి అనుకూలం. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం. వారం చివరిలో స్త్రీలతో విభేదాలకు దూరంగా ఉండాలి. ప్రయాణాలలో జాగ్రత్తలు అవసరం. దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో ఆత్మీయులను సంప్రదించాలి.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలోదూర ప్రయాణాలు కొరకు ఆలోచిస్తారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుంది. తెలియని అసంతృప్తి. ప్రశాంతత లోపం. అధిగమించడానికి పుణ్య బలాన్ని పెంచుకోవాలి సంఘ సేవ బాగా చేస్తారు. పెద్దల ఆశీస్సులు ఉంటాయి. వారం మధ్యలో వృత్తిపరమైన ప్రయాణాలు, అలసట అధిక బాధ్యతలు. అయినప్పటికీ అభివృద్ధి కరంగా ఉంటుంది. ఉన్నత స్థాయి అధికారులు ప్రశంసిస్తారు. అధికారంలో ఉండే వ్యక్తి సహకారం లభిస్తుంది. నూతన వృత్తుల కొరకు ప్రయత్నించే నిరుద్యోగులకు కొంత అనుకూలమైన సమయం. వృత్తిలో గౌరవం పెరుగుతుంది. శ్రమకు తగ్గ ఆదాయాన్ని అందుకుంటారు. వారం చివరిలో ఆరోగ్యం బాగుంటుంది శారీరక శ్రద్ధ పెరుగుతుంది ఆకర్షణీయమైన నిర్ణయాలు తీసుకుంటారు.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోఅనుకోని వ్యక్తుల విమర్శలు, కొత్త వ్యక్తుల జోక్యం ముఖ్య అంశాలలో చికాకును పెంచుతాయి.ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. . అనవసర ప్రయాణాలు, ఖర్చులు , ముఖ్యమైన పనులు వాయిదా కొంత అశాంతిని పెంచినప్పటికీ అసంతృప్తికి లోను కాకుండా ధైర్యంగా ముందుకు వెళతారు. సమయానికి ఆహార స్వీకరణ, విశ్రాంతి అవసరం. వాగ్వాదాలకు దూరంగా ఉండుట మేలు. వారం మధ్యలో రావలసిన లాభాలలో , భూమి, గృహ సంబంధిత ఆర్థిక అంశాలలో, కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. సమయానికి మాట సహాయం చేయవలసిన ఆత్మీయులు మొహం చాటు వేయడంతో కొంత ఇబ్బంది ఎదురైనప్పటికీ మీ పనులు మీరు చేసుకుంటూ ముందుకు వెళతారు. విద్యార్థులు ఎక్కువ శ్రద్ధతో చదవాలి.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో కళాకారులకి దూర ప్రదేశాలలో అవకాశములు. ఆధ్యాత్మిక ఆలోచనలు చేస్తారు. వ్యాపార, వృత్తిపరమైన భాగస్వాములతో ఘర్షణ లేకుండా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. వారం మధ్యలో భాగస్వామి ఆరోగ్య విషయంపై తగిన శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యమైన పనుల యందు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వృత్తిపరంగా విమర్శలకు అవమానాలకు లోను కాకుండా జాగ్రత్తలు అవసరం. ఒక సమాచారం చిరాకును కలిగిస్తుంది. పనులలో ఆలస్యాలు, ఆటంకాలు ఎదురైనప్పటికీ సంయమనం పాటించాలి. వృత్తిపరంగా అధికారులను, రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తుల్ని కలవడానికి ప్రయత్నాలు చేస్తారు.


రకుల్ ప్రీత్ సింగ్